# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు

CIRCLEATED IN KURNOOL HYDERABAD AMARAVATHI, TIRUPATI, SPSR NELLORE PRAKASHAM, YSR KADAPA, PRAKASAM,ANANTAPUR ,VIJAYAWADAGUNTUR ,VISAKHAPATNAM,EASTGODAVARI, | ఎడిటర్ : యన్.మహేశ్వరరెడ్డి | ఆదివారం 14 జూన్, 2026 | సంపుటి : 05 / సంచిక : 131/ పేజీలు : 12 / వెల : రూ.5/-






'జలధార'తో రాష్ట్రం సస్యశ్యామలం





# ఏటా వరద.. ఎన్నాళ్లీ బెడద?

- కొద్దిపాటి వర్షాలకే నగరాలను ముంచెత్తుతున్న ముంపు నీరు
- ప్రతిబంధకంగా కాలువల ఆక్రమణలు...పేరుకుపోతున్న పూడికలు
- వర్షాలు తీవ్రమయ్యే లోపు నివారణ చర్యలు తీసుకుంటే మేలు

విజయవాడలో ఇటీవల కురిసిన వర్షానికి ఆటోనగర్ పీఅండ్‌టీ కాలనీలో పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. 24 గంటల వరకు అదే పరిస్థితి. ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

..2లో..

**అమరావతి :** వర్షాకాలం మొదలైనా.. పలు నగరపాలక సంస్థల్లో వరద నీటి సమస్య పరిష్కార చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి. డ్రెయిన్ల ఆక్రమణలు, పూడిక తొలగించకపోవడం, ఏటా పెరుగుతున్న వరద నీటి ఉద్ధృతికి అనుగుణంగా కాలువలను విస్తరించకపోవడంతో పలు నగరాలు ఏటా ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలోని 123 పుర, నగరపాలక సంస్థల్లో చిన్న, పెద్ద వర్షపునీటి కాలువలు 24,053 కిలోమీటర్ల మేర ఉన్నాయి. మరో 23,611 కి.మీ. కొత్తగా నిర్మించాలి. పుర, నగరపాలక సంస్థల్లో నిధుల కొరతతో అన్ని పనులూ ఒకేసారి చేపట్టే అవకాశం లేదు. దశల వారీగా నిర్మించినా.. కొంతవరకు ఉపశమనం ఉంటుంది. ప్రధానంగా విజయవాడ, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, కర్నూలు, కాకినాడ నగరాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. రోడ్లపై, లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు రోజుల కొద్దీ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**విజయవాడ భవానీపురంలో అసంపూర్తిగా వరదనీటి కాలువ నిర్మాణ పనులు... సమస్య:** అసంపూర్తిగా నిలిచిన వరదనీటి కాలువలతో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తోంది. 2017లో తెదేపా



## ఇది కదా 'ఏపీ బ్రాండ్'

రెండేళ్లలో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు

2

## 1.44 లక్షల మందికి... బ్రేక్‌ఫాస్ట్

తొలి విడతలో 1,269 పాఠశాలలు...

33 కళాశాలల్లో అమలు ..రేపు 8 జిల్లాల్లో ప్రారంభం

హరే కృష్ణ మూమెంట్... మన్నా ట్రస్ట్‌లకు బాధ్యతలు

పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన కొడంగల్‌లో..




# దేశ రక్షణలో భారత్ మరో... కీలక మైలురాయి..!!

- బాలిస్టిక్ క్షిపణి దాడులకు భారత్ చెక్.. డీఆర్డీఓ పరీక్ష సక్సెస్
- దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల దాడులను తిప్పికొట్టే సామర్థ్యం భారత్‌కు ఉంది
- జూన్ 10, 11 తేదీల్లో వరుసగా మూడు ఫ్లైట్ టెస్ట్‌లు నిర్వహించింది...
- ఇందులో ఇంటర్‌సెప్టర్లు విజయవంతంగా తమ లక్ష్యాలను ఛేదించింది..
- బీఎండీ సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో భారత్ చేరినట్లయ్యిందని డీఆర్డీవో వెల్లడి

దేశ వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. గడచిన రెండు రోజుల్లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మూడు కీలక క్షిపణులను విజయవంతంగా పరీక్షించింది. ఇందులో బహుళ అంచెల బాలిస్టిక్ క్షిపణి రక్షణ (బీఎండీ) వ్యవస్థ, సరికొత్త మధ్యశ్రేణి నౌకా విధ్వంసక అస్త్రానికి సంబంధించిన పరీక్షలున్నాయి. ప్రత్యర్థి ప్రయోగించిన దీర్ఘశ్రేణి అణ్వస్త్ర క్షిపణులు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు (అవాక్స్), యుద్ధ విమానాలను వేగంగా గుర్తించి, వాటి గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కచ్చితత్వంతో నేలకూల్చే బీఎండీ వ్యవస్థను భారత్ అభివృద్ధి చేస్తోంది.

దేశ రక్షణలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. శత్రుదేశాల నుంచి ఎదురయ్యే విభిన్న ముప్పులను ఎదుర్కొనేలా మన రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకుంది. బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, యాంటీ షిప్ వార్‌ఫేర్‌లో కొత్త టెక్నాలజీని డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. దీంతో దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల దాడులను తిప్పికొట్టే సామర్థ్యం భారత్‌కు లభించినట్లయ్యింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో వెల్లడిస్తూ.. ప్రయోగానికి సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. దీర్ఘశ్రేణి ఖండాంతర క్షిపణుల ఆట కట్టించే మల్టీలేయర్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థను డీఆర్డీవో ఇటీవల విజయంతంగా పరీక్షించింది. జూన్ 10, 11 తేదీల్లో వరుసగా మూడు ఫ్లైట్ టెస్ట్‌లు నిర్వహించింది. ఇందులో ఇంటర్‌సెప్టర్లు విజయవంతంగా తమ లక్ష్యాలను ఛేదించి.. బీఎండీ సామర్థ్యాన్ని నిరూపించాయి. ఖండాంతర క్షిపణి ముప్పును ఎదుర్కొనేలా అధునాతన సాంకేతికతతో ఈ డిఫెన్స్ వ్యవస్థను డీఆర్డీవో రూపొందించింది. దీంతో బీఎండీ సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో భారత్ చేరినట్లయ్యిందని డీఆర్డీవో వెల్లడించింది. ఇక నావెల్ యాంటీ-షిప్ మిసైల్ మీడియం రేంజ్ తొలి పరీక్షను కూడా శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవోను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.



# ఏపీ లిక్కర్ స్కామ్‌లో... అంతిమ లబ్ధిదారుడు జగనే..!!

మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.

- మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యలు
- చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు..
- కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చాం
- ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలి
- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టింది
- మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసింది : డోలా వీరాంజనేయ స్వామి

..2వ పేజీలో




**అమరావతి :** మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కంపెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం




## ఈ పథకం కింద రూ.15వేలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది..!!

ప్రభుత్వం అన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది

ఈ నిధుల్లో రూ.13 వేల విద్యార్థుల తల్లి ఖాతాలో నేరుగా జమ చేస్తుండగా..

మరో రూ.2వేలు స్కూల్ ఖాతాలో వేయనుంది

రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అండగా నిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లి వందన అనే పథకాన్ని తీసుకొచ్చిన విషయం అందరికి తెలిసిందే. అయితే ప్రస్తుతం స్కూల్స్ రీఓపెన్ అవుతున్న నేపథ్యంలో ఈ పథకం కింద రూ.15 వేలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఈ పథకానికి మీరు అర్హులా కాదా అనేది తెలుసుకునేందుకు ప్రభుత్వం అన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మన అర్హతను ఎలా తెలుసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

..2వ పేజీలో

సూర్య జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం 14 జూన్, 2026

# ఈ పథకం కింద రూ.15వేలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది..!!

**ప్రభుత్వం అన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది**

**ఈ నిధుల్లో రూ.13 వేల విద్యార్థుల తల్లి ఖాతాలో నేరుగా జమ చేస్తుండగా.. మరో రూ.2వేలు స్కూల్ ఖాతాలో వేయనుంది**

రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అండగా నిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లి వందన అనే పథకాన్ని తీసుకొచ్చిన విషయం అందరికి తెలిసిందే. అయితే ప్రస్తుతం స్కూల్స్ రీఓపెన్ అవుతున్న నేపథ్యంలో ఈ పథకం కింద రూ.15వేలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఈ పథకానికి మీరు అర్హులా కాదా అనేది తెలుసుకునేందుకు ప్రభుత్వం అన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మన అర్హతను ఎలా తెలుసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తల్లికి వందనం అనే పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ పథకం కింద ప్రభుత్వ స్కూల్‌లలో చదివే అర్హులైన విద్యార్థులకు ఏడాకి రూ.15వేల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నిధుల్లో రూ.13 వేల విద్యార్థుల తల్లి ఖాతాలో నేరుగా జమ




చేస్తుండగా.. మరో రూ.2వేలు స్కూల్ ఖాతాలో వేయనుంది. అయితే వేసవి సెలవులు ముగిసి మళ్లీ స్కూల్స్ ఓపెన్ అవ్వడంతో ఇప్పుడు విద్యార్థులకు ఈ నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకానికి మీరు అర్హులా కాదా అనేది తెలుసుకోవడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అవును లబ్ధిదారులు https://bm-sgsw.ap.gov.in/BM /Schemeout వెబ్ సైట్‌ను సందర్శించి మీరు అర్హులా కాదా అనేది తెలుసుకోవచ్చు. ఒకవేళ మీకు ఆన్‌లైన్‌లో చెక్ చేయడం వీలుపడకపోతే, మీ గ్రామంలోని గ్రామ , వార్డ్ సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా లేదా మీ పిల్లలు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి కూడా మీ అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు.

## ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారుడు జగనే..!!

**(మొదటిపేజి తరువాయి)** సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

## కూలిన వాయుసేన విమానం

**కూలిన వాయుసేన విమానం**

**అస్సాంలోని జోర్హాట్‌లో ప్రమాదం**

**ఐదుగురు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది మృతి**

**న్యూఢిల్లీ :** అస్సాంలోని జోర్హాట్‌లో ఉన్న వైమానిక స్థావరంలో ల్యాండ్ అవుతున్న సమయంలో వాయుసేనకు చెందిన ఏఎన్-32 రవాణా విమానం శనివారం ప్రమాదానికి



గురైంది. ఈ దుర్ఘటనలో ఐదుగురు సిబ్బంది మృత్యువాత పడ్డారు. వీరిలో ఇద్దరు అధికారులు కూడా ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ కో-పైలెట్‌కు స్థానిక మిలిటరీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో ఈ విమానంలో ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు చెప్పారు. జోర్హాట్‌లోని రౌరీ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దైనందిన విధుల్లో ఉన్నప్పుడు ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం సంభవించిందని భారత వాయుసేన తెలిపింది. చనిపోయిన వారిలో స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభం కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ (వాయు) ఖేమారామ్ కుమావత్, అగ్నివీర్ (వాయు) దానిష్ ఆలం ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలను కనుగొనేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. విమానం రన్‌వేపై దిగుతున్న సమయంలో నియంత్రణ కోల్పోయి రన్‌వే నుంచి పక్కకి జారిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పారు. టాక్సీవే మీదుగా దూసుకెళ్లి రెండు ముక్కలైందని, తర్వాత మంటలు చెలరేగాయని తెలిపారు. అయితే విమాన ప్రమాదంలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయని ది వీక్ పత్రిక తన కథనంలో పేర్కొంది. టాక్సీయింగ్ చేస్తున్న సమయంలో శక్తివంతమైన పేలుడు సంభవించిందని, ల్యాండింగ్ సమయంలో పల్టీకొట్టిందని అక్కడి వర్గాలు చెప్పినట్లు తన కథనంలో పేర్కొంది. రష్యా డిజైన్ చేసిన రెండు ఇంజిన్ల టర్బోప్రాప్ ఏన్టనోవ్ (ఏఎన్)32 రవాణా విమానాలు దశాబ్దాలు తరబడి ఐఏఎ?ఫలో సేవలందిస్తున్నాయి. సంక్లిష్టమైన భౌగోళిక ప్రాంతాలకు సిబ్బందిని తీసుకెళ్లడానికి, కీలకమైన సామగ్రిని మోసుకెళ్లడానికి ఈ విమానాలను వినియోగిస్తున్నారు. వీటిని పలుమార్లు అప్‌గ్రేడ్ చేశారు. కాగా, పాతపడిన వీటి స్థానంలో మధ్యస్థస్థాయి రవాణా విమానాల(ఎంటీఏ) కొనుగోలుకు 2022లో సమాచార అభ్యర్థన(ఆర్ఎఫ్ఐ) జారీ చేసింది.

## 1.44 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్

**తొలి విడతలో 1,269 పాఠశాలలు... 33 కళాశాలల్లో అమలు**

**రేపు 8 జిల్లాల్లో ప్రారంభం**

**హరే కృష్ణ మూమెంట్... మన్నా ట్రస్ట్‌లకు బాధ్యతలు**

**పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన కొడంగల్‌లో..**

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభించనుంది. అందులో 1,269 పాఠశాలలు, 33 కళాశాలలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది విద్యార్థులకు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం పూట అల్పాహారం అందనుంది. పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా కొత్త విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో ఇప్పటికే ఉన్న 7 కిచెన్లను ఉన్నతీకరిస్తారు. మిగిలినవి కొత్తగా నిర్మిస్తారు. ఒక్కో కిచెన్‌కు ప్రభుత్వం తన వాటాగా 70% భర్తిస్తుంది. మిగిలిన 30% మొత్తాన్ని ఆయా స్వచ్ఛంద సంస్థలు ఖర్చు చేయనున్నాయి. కిచెన్ల నిర్మాణ బాధ్యతలను తెలంగాణ విద్యా సంక్షేమ, మౌలికాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి.

**22 లక్షలు:** బ్రేక్‌ఫాస్ట్ పథకంతో లబ్ధి పొందనున్న రాష్ట్రంలోని మొత్తం ప్రీ ప్రైమరీ(పూర్వ ప్రాథమిక) నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య.

**రూ.720 కోట్లు:** పాఠశాలల్లో బ్లాక్రఫాస్ట్ కోసం చేయనున్న ఖర్చు. వీటిలో అల్పాహారానికి రూ.540 కోట్లు, పాలకు రూ.180 కోట్లు.

**రూ.56 కోట్లు:** ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించిన మొత్తం ఇది.

**పాలు/రాగి జావ:** మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ ఇవ్వనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు 75 మి.లీ., మిగిలిన తరగతుల వారికి 100 మి.లీ. చొప్పున పాలు అందజేస్తారు. 2 సంస్థలు... 8 జిల్లాలు: బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్, మన్నా ట్రస్ట్‌లు మొత్తం ఎనిమిది జిల్లాల్లో అమలు చేయనున్నాయి.

**హరే కృష్ణ మూమెంట్:** వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 పాఠశాలల్లో...1,03,891 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. వికారాబాద్, నారాయణపేట, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 10,293 మందికి కూడా బ్రేక్‌ఫాస్ట్ అందుతుంది.

**మన్నా ట్రస్ట్:** హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 107 పాఠశాలల్లో చదివే 26,294 మంది విద్యార్థులకు అందుతుంది. ఈ రెండు జిల్లాల్లో 12 కళాశాలల్లోని 4,132 మందికి కూడా లభిస్తుంది.

**జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం...** ప్రస్తుతం పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకూ విస్తరించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని కూడా సోమవారం నుంచే 33 కళాశాలల్లో ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 430 ప్రభుత్వ కళాశాలలున్నాయి. వాటిల్లో దాదాపు 1.70 లక్షల మంది చదువుతున్నారు.

# ఏటా వరద.. ఎన్నాళ్లీ బెడద?

**(మొదటిపేజి తరువాయి)** ప్రభుత్వం రూ.461 కోట్లతో 440 కి.మీ. పొడవైన కాలువల నిర్మాణ పనులను ప్రారంభించింది. రూ.172 కోట్ల వ్యయంతో 250 కి.మీ. మేర పనులు పూర్తయ్యాక.. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని పక్కన పెట్టింది.

**పరిష్కారం ఇలా:** పెండింగ్‌లో ఉన్న 190 కి.మీ. కాలువల నిర్మాణం పూర్తికి సవరించిన రూ.280 కోట్ల అంచనాలను ప్రభుత్వం ఆమోదించాలి. సీఆర్‌డీఏ నిధులతో పెండింగ్ పనులు పూర్తి చేయించాలన్న ప్రతిపాదననైనా పరిశీలించాలి.

సమస్య: ఈ నగరం గుండా వెళ్లే 14 పంట కాలువలు ఒకప్పుడు 40 నుంచి 60 అడుగుల వెడల్పుతో ఉండేవి. అక్రమణలతో అవి సగానికి కుచించుకుపోయాయి. దీంతో అయ్యప్పగుడి, టీచర్స్ కాలనీ, తల్పగిరి, ఆర్టీసీ కాలనీలు, వైఎస్సార్, పరమేశ్వర్, మనమసు నగర్‌లు, ఇరగాలమ్మ సంగం, సాయినగర్, పొర్లుకట్ట, జయలలిత నగర్, ఈద్గామిట్ట తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

**పరిష్కారం ఇలా:** కాలువల ఆక్రమణలను ఇప్పటికే సర్వే చేసి గుర్తించారు. వాటి తొలగింపు ప్రక్రియ ఎప్పటికప్పుడు ప్రారంభించి, నిలిపివేస్తున్నారు. ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే.. సమస్య కొంతవరకు పరిష్కారమవుతుంది.

**సమస్య:** పీకలవాగు, అంబేద్కర్ వాగుల్లో పూడిక పేరుకుపోవడం, ఆక్రమణలతో వరద నీరు వెనక్కి వచ్చి కాలనీలను ముంచెత్తుతోంది. ఏటీ అగ్రహారం, మురికిపేట తదితర చోట్ల డ్రెయిన్ల నిర్మాణంలో ప్రణాళికా లోపంతో ముంపు సమస్య తలెత్తుతోంది. నల్లపాడు డ్రెయినుకు రక్షణ గోడ పూర్తిగా నిర్మించకపోవడంతో ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి వరద నీరు చేరుతోంది.

**పరిష్కారం ఇలా:** పీకలవాగులో 13 కి.మీ. మేర ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేసేందుకు రూ.210 కోట్లతో తయారు చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కార్యరూపం దాల్చేలా చూడాలి. కాలువలను ఆధునికీకరించేందుకు గతేడాది ఆగస్టులో రూ.600 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచినా.. అనేక పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. వాటిని పూర్తి చేయించాలి.





**సమస్య:** నగర పరిధిలో 3.5 కి.మీ. పొడవున ఉన్న ఏలేరు కాలువలో నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా అనేక ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. ఉప్పుటేరులో కలిసే గాడేరు మురుగు కాలువ పూడికతో నిండిపోవడం, ఆక్రమణలతో జనచైతన్య, ఎఫ్‌సీఐ కాలనీలు, మారుతీనగర్, గైగోలుపాడు తదితర ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి.

**పరిష్కారం ఇలా:** ఏలేరు కాలువ ఆధునికీకరణకు పదేళ్ల క్రితం రూ.264 కోట్లతో పనులను ప్రతిపాదించారు. నిధులు కేటాయించకపోవడంతో అంచనాలు ప్రస్తుతం రూ.800 కోట్లకు చేరుకున్నాయి. దశల వారీగానైనా ఆయా పనులు చేపడితే మేలు.

**ఒంగోలులో అధ్వానంగా పోతురాజు కాలువ... సమస్య:** కీలకమైన పోతురాజు కాలువ ఆక్రమణలతో వరదనీరు ఏటా నగరంలోని అనేక ప్రాంతాలను ముంచెత్తుతోంది. వంద మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ కాలువ సగానికి కుచించుకుపోయింది.

**పరిష్కారం ఇలా:** పోతురాజు కాలువ ఆధునికీకరణ కోసం వైకాపా ప్రభుత్వంలో పనులు ప్రారంభించి, నిధుల కొరతతో నిలిపివేశారు. ఇప్పటికైనా ఆయా పనులను పూర్తి చేయాలి.

**కర్నూలులో రక్షణ గోడలేని హంద్రీనది ...** సమస్య: భారీ వర్షాలకు తుంగభద్ర, హంద్రీ నదులు, చక్కెర, సుద్దవాగుల నుంచి వరద నీరు సమీప కాలనీల్లోకి చేరుతోంది. బుధవారపేట, రోజాదర్గా, డాక్టర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, గణేశ్‌నగర్ తదితర ప్రాంతాలు ప్రభావితం అవుతున్నాయి. పరిష్కారం ఇలా: తుంగభద్ర, హంద్రీ నదులు, చక్కెర, సుద్దవాగులకు రక్షణ గోడలు నిర్మించాలి. అందుకోసం రూ.244.70 కోట్లు అవసరమని 15 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు తయారైనా.. ఆచరణకు నోచుకోలేదు. తుంగభద్ర, హంద్రీ నదుల సంగమ ప్రాంతం నుంచి రైల్వే బ్రిడ్జి వరకు రూ.75.93 కోట్లతో రక్షణ గోడ నిర్మించినా.. సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుంది.

**మూడేళ్లలో పనులు పూర్తిచేస్తాం..నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి**

వర్షాకాలంలో ఏటా ముంపు బెడద ఎదుర్కొంటున్న నగరాలు, పట్టణాల్లో సమస్య పరిష్కారానికి రూ.9 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మూడు దశల్లో చేపట్టనున్న కాలువల నిర్మాణ పనుల్లో.. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యమిస్తాం. వచ్చే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం. ఈ ఏడాది కాలువల్లో పూడికలు తొలగించాలని కమిషనర్లకు ఆదేశాలిచ్చాం. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.


## సంపాదకీయం

# ఇది కదా 'ఏపీ బ్రాండ్'

**రెండేళ్లలో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు**

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు**

**అమరావతి :** పరిశ్రమలు రావాలంటే అనువైన వాతావరణం ఉండాలి. నిర్ణయాల్లో వేగం, సానుకూల దృక్పథం, ఆకర్షణీయ విధానాలు కావాలి. ఇవన్నీ ఉండటంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారిపోయింది. పటిష్ఠమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్, పెట్టుబడిదారుల అనుకూల వాతావరణంతో తయారీ రంగం, మౌలిక సదుపాయాల ఆధారిత పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2024 జూన్ నుంచి ప్రభుత్వం వివిధ సంస్థలతో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు లభించనున్నాయి. దేశానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25.3 శాతం రాష్ట్రానికి రావడం ఏపీ 'బ్రాండ్ వాల్యూ'కు నిదర్శనం.




1. కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి.. దిక్సూచి లేని పారిశ్రామిక రంగం

జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తల వేధింపులను మన రాష్ట్రానికి బ్రాండ్ వ్యాల్యూగా మార్చేసింది. అధికారంలోకి రాగానే.. గత తెదేపా ప్రభుత్వం వివిధ సంస్థలతో కుదుర్చుకున్న ఎంవోయూలు, వాటికి కేటాయించిన భూముల సమీక్ష పేరుతో ఇబ్బందులు పెట్టింది. పరిశ్రమల కోసం కేటాయించిన భూములను వెనక్కి లాక్కుని, రాష్ట్రం నుంచి వెళ్లే వరకు వెంటాడింది. పారిశ్రామికవేత్తలపై రాజకీయ కక్షలకు పాల్పడింది. ఈ కారణంగా రాష్ట్రం వైపు చూడాలంటేనే పెట్టుబడిదారులు హడలిపోయారు. పాలన వికేంద్రీకరణ పేరుతో రాజధాని అమరావతిని ధ్వంసం చేయడం వంటి చర్యలతో పెట్టుబడిదారులను భయాందోళనలకు గురిచేసింది.

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న ఆసియా పేపర్ అండ్ పల్ప్ (ఏపీపీ), జాకీ ఇండస్ట్రీస్, లులు గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అదానీ డేటా సెంటర్, అమరరాజా బ్యాటరీస్.. వంటి సంస్థలు జగన్ తీరుతో పెట్టుబడుల ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నాయి.

వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రాష్ట్రం వైపు చూసేవారే లేకుండా పోయారు. దేశ, విదేశాల్లో 15 ఔట్‌రీచ్‌లు నిర్వహించినా.. ఎక్స్‌పోలలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసినా జగన్ సర్కార్‌ను ఎవరూ నమ్మలేదు.

వైకాపా ఐదేళ్లలో ఒకే ఒక్క పెట్టుబడుల సదస్సు నిర్వహించింది. 2023 మార్చిలో విశాఖలో నిర్వహించిన ప్రపంచ దేశాల పెట్టుబడుల సదస్సులో 388 మంది పెట్టుబడిదారులతో రూ.13.12 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిని గ్రౌండింగ్ చేయడంపై దృష్టి పెట్టలేదు.

విదేశీ పెట్టుబడులు ఆకర్షించడంలో పెద్ద రాష్ట్రాలతో పోటీపడే రాష్ట్రాన్ని 2019 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య 13వ స్థానానికి పడిపోయేలా చేసింది.

దావోస్ వెళ్లినా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారు లేక చివరకు దేశీయ కంపెనీలు అదానీ, అరబిందో, గ్రీన్‌కో వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని దావోస్ నుంచి తెచ్చిన పెట్టుబడులుగా చెప్పుకోవాల్సి వచ్చింది.

**2. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో.. వెల్లువలా పెట్టుబడులు..**

**రాష్ట్రానికి వచ్చిన భారీ సంస్థలు**

ఐదేళ్ల విధ్వంసాన్ని అధిగమించి, కోల్పోయిన బ్రాండ్ వాల్యూను పునరుద్ధరించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. పారిశ్రామికవేత్తలతో నిరంతరం సంప్రదింపులు, వారి అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అనువైన వాతావరణాన్ని పునరుద్ధరించింది. ప్రభుత్వం తరఫున అధికారులే పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరిపి, వారి సమస్యలు పరిష్కరించడానికి ప్రాధాన్యమిచ్చింది. దీంతో రాష్ట్రానికి భారీ సంస్థలు వరుస కట్టాయి. అమెరికా తర్వాత అతి పెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేస్తోంది. దీన్ని 13 నెలల్లోనే గ్రౌండింగ్ చేయడం ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయాలకు నిదర్శనం. అర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమను విశాఖకు తీసుకురావడంలోనూ వేగవంతమైన నిర్ణయాలే కీలకం. స్లరీ పైప్‌లైన్ ఏర్పాటుకు కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు వేగంగా సాధించింది. ప్రకాశం జిల్లాలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రూ.లక్ష కోట్లతో చమురుశుద్ధి కర్మాగారం ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కేవలం 36 రోజుల్లోనే పుట్టపర్తిలో రూ.15,000 కోట్లతో యుద్ధ విమానాల ప్రాజెక్టును గ్రౌండింగ్ చేసింది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజీస్ సిస్టమ్ లిమిటెడ్ రక్షణ రంగ ఆయుధాల తయారీ ప్రాజెక్టును మడకశిరలో ఏర్పాటు చేస్తోంది. రాయల్ ఎన్‌ఫీల్డ్.. రూ.2,500 కోట్లతో ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులను రూ.1,600 కోట్లతో అభివృద్ధి చేస్తోంది.

**పెట్టుబడుల కోసం దేశాలు దాటి..** దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం పాల్గొంది. ఏఐ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఏపీ అనుకూలమని వివరించారు. రష్యాలోని మాస్కోలో ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు మంత్రి లోకేశ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందం హాజరై స్పేస్, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో అవకాశాలను వివరించింది. పెట్టుబడుల ఆకర్షణ కోసం యూఏఈ, మధ్యప్రాచ్య దేశాల్లో రోడ్‌షోలు నిర్వహించింది. సింగపూర్‌లో నిర్వహించిన వరల్డ్ సిటీస్ సమిట్‌లో పాల్గొంది.

**పాలసీలతో విధానాలపై స్పష్టత**

ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ

ఏపీ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్

ఏపీ ఎలక్ట్రానిక్స్

ఐటీ, జీసీసీ, డేటా సెంటర్

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్

ఏపీ ఏరోస్పేస్, డిఫెన్స్.. ఇలా 22 పాలసీలను ప్రభుత్వం తీసుకొచ్చింది.

**756 ఒప్పందాలు.. రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు ...** 2025 నవంబరులో విశాఖ భాగస్వామ్య సదస్సులో 538 ఎంవోయూలు కుదుర్చుకుంది. వాటి ద్వారా రూ.11.37 లక్షల కోట్ల పెట్టుబడులు, 14.03 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ఆ సంస్థలు పేర్కొన్నాయి. 2024 జూన్ నుంచి 218 సంస్థలు రూ.10.27 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వాటి ద్వారా 8.97 లక్షల మందికి ఉపాధి లభించనుంది.

ఈ ఒప్పందాల్లో 100 ప్రాజెక్టులు గ్రౌండయ్యాయి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో కియా కార్ల కంపెనీ తీసుకొచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా రూపురేఖలు మార్చింది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేసింది. ప్రతి విభాగానికి కచ్చితమైన కాలపరిమితులు నిర్ణయించింది. రోజుల వ్యవధిలో భూమి కేటాయింపు పూర్తి చేయడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. పెట్టుబడిదారుల పోర్టల్ ద్వారా ప్రాజెక్టులకు భూమి కేటాయింపు నుంచి పనులు ప్రారంభించే దశ వరకు నిరంతరం పర్యవేక్షించే ఏర్పాట్లు చేసింది. నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా మానవ వనరులను సిద్ధం చేస్తోంది.

**3. వచ్చే మూడేళ్లలో ఏం చేయాలంటే.. వేగాన్ని కొనసాగిస్తూ.. ఎకో సిస్టమ్ అభివృద్ధి**

ఎక్కువ సంఖ్యలో ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలి. ప్రభుత్వం నిర్దేశించిన 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యం నెరవేరడంలో ఎంఎస్ఎంఈలు కీలకం. ప్రపంచవ్యాప్త పరిణామాలతో ఎంఎస్ఎంఈలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ముడిసరకు ధరలు, రవాణా ఖర్చులు పెరిగి వాటిపై అదనపు భారం పడింది. వాటి ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రాధాన్యం కల్పించాలి. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ విధానం అమలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ఎంఎస్ఎంఈల నుంచి ఉత్పత్తులు కొనే సంస్థలు వాటికి నిర్దేశిత వ్యవధిలో (45 రోజుల్లో) బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. ఎంఎస్ఎంఈల కోసం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, సెక్టార్ బేస్డ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కామన్ ఫెసిలిటీలను కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఏపీ క్రెడిట్ గ్యారంటీ పథకం కింద వాటికి రుణాలను అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న 20.77 లక్షల ఎంఎస్ఎంఈలకు రుణాలు అందించడంపై దృష్టి పెట్టాలి. పాలసీ నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు ప్రోత్సాహకాలను విడుదల చేయాలి.

# ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపులు ప్రారంభం

**ఓటర్ల జాబితా మ్యాపింగ్, డూప్లికేట్ ఎంట్రీల సవరణకు చర్యలు**

**వేంపల్లె జూన్ 13 సూర్య న్యూస్:** మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపులు ప్రారంభమయ్యాయి. జూన్ 13, 14 తేదీల్లో మండల పరిధిలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి బీఎల్ఓల ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓలు, సూపర్వైజర్ల పర్యవేక్షణలో మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్యుమరేషన్, మ్యాపింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఓటర్ల జాబితాలో ఉన్న డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించడం, చిరునామా మార్పులు నమోదు చేయడం, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం వంటి సవరణ పనులు చేపడుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బీఎల్ఓలు వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలు తమ ఓటరు గుర్తింపు కార్డు తో సహకరించి స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



## శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఘనంగా
# ముగిసిన భాగవత సప్తాహం

**ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి**

**వేంపల్లె జూన్ 13 సూర్య న్యూస్:** స్థానిక పట్టణంలోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేది నుండి నిర్వహించిన భాగవత సప్తాహం శనివారంతో ఘనంగా ముగిసిందని పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి తెలిపారు. 7వ తేది నుండి 13వ తేదీ వరకు భాగవత సప్తాహం, భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆలయ వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్ర పుష్పం, కలశ పూజ అనంతరం కలశ ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భాగవత భక్త సమాజం సభ్యులను రవికుమార్ రెడ్డి, కుమారుడు ప్రీతం కుమార్ రెడ్డి, కోడలు వైష్ణవి ఘనంగా సన్మానించారు. 7 రోజుల పాటు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, ఆలయ వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# కమ్మపల్లి ప్రభుత్వ ఇంటి జాగాలను కాపాడండి

**జనసేన నేత ఎన్. ఆర్. ఐ వాసు**

**తాశీల్దార్ భాను ప్రసాద్ కు వినతి పత్రాన్ని సమర్పించిన గ్రామస్తులు**

**సమగ్ర దర్యాప్తుకు ఆదేశించిన తహశీల్దార్**

**చిన్నగొట్టిగల్లు జూన్ 13 సూర్య న్యూస్:** మండలం లోని తిప్పిరెడ్డిగారి పల్లి పంచాయతీ ,కమ్మపల్లికి చెందిన గ్రామ కంఠంలో ఉన్న ప్రభుత్వ భూమిని,అర్హులు కోసం కేటాయించిన ఇంటి స్థలాలను కాపాడాలని జనసేన నేత ఎన్.ఆర్.ఐ వాసు మండల తాశీల్దార్ భాను ప్రసాద్ ను కోరారు. కమ్మపల్లి సర్వేనెంబర్ 76 లో ఉన్న గ్రామ కంఠం భూమిని 2004లో గృహ స్థలాల కోసం లే అవుట్ ల ను ఏర్పాటు చేయబడి,అంతర్గత రహదారులు,ఇతర అభివృద్ధి పనులు కోసం గ్రామ పంచాయతీ నిధులు నుండి సుమారు 2 లక్షల రూపాయలు వరకు ఖర్చు చేసినట్లుగా తెలిపారు. అయితే ఆ భూమిని స్థానికుడైన రాజగోపాల్ నాయుడు అతని భార్య జయలక్ష్మి లు అర్హులైన పేదవారికోసం కేటాయించబడిన ఇంటి స్థలాలను అక్రమంగా ఆక్రమించడమే కాకుండా లేఅవుట్ల సరిహద్దులను చెరిపి వేస్తూఅంతర్గత రహదారులను ధ్వంసం చేసి భూమి చుట్టూ కంచి వేసినట్లు తెలిపారు. వీరి భారీ నుంచి గ్రామ కంఠం భూమిని కాపాడి అర్హులైన పేదవారికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ గ్రామస్తులు తాశీల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. వెంటనే స్పందించిన తాశీల్దార్ భాను ప్రసాద్ సమగ్ర దర్యాప్తు కోసం రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలను మంజూరు చేసి తగు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో బీజేపీ చిన్నగొట్టిగల్లు మండలాధ్యక్షుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామ కంఠం భూములను పేదల ఇంటి స్థలాలకే కేటాయించాలని కోరారు. ఇలాంటి ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని రెవిన్యూ సిబ్బందిని కోరారు. చంద్రగిరి మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూకమ్మపల్లి గ్రామ కంఠం భూమిని ఇంటి స్థలాలుగా ఆక్రమించిన ఆక్రమణదారుడు సుమారు 30 లక్షల వరకు అమ్ముకొంటూ సొమ్ము చేసుకుని దర్జాగా తిరుగుతూ,నాయకుడిగా చలామణి అవుతున్నాడని ఆరోపించారు. అర్హులైన పేదవారికి ఇంటి స్థలాలను మంజూరు చేసేంతవరకు పేద వారికి అండగా ఉంటామని తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షుడు దూది జస్వంత్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం అవసరమయ్యే గ్రామకంఠం భూములను అన్యాక్రాంతం కాకుండా పేదలకు కేటాయించాలని కోరారు.



## ఎల్లా వత్తుల లో దేవాలయ భూముల
# కౌలు వేలం పాటలు

**వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు**

**రుద్రవరం జూన్ 13 సూర్య న్యూస్:** మండలంలోని ఎల్లా వత్తుల గ్రామంలో శనివారం దేవాలయ భూముల కౌలు వేలం పాటలు నిర్వహించారు. గ్రూప్ దేవస్థానము లు. 2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయి జయచంద్ర రెడ్డి, దేవాలయ ఇన్స్పెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఎల్లా వత్తుల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి, నాగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన 48.89 ఎకరాల భూములకు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంపాటల ద్వారా రూ 4 లక్షల 5000 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయి జయచంద్ర రెడ్డి తెలిపారు. వేలం పాటల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వేలం పాటల్లో గ్రామ పెద్దలు పుల్లయ్య రైతులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించిన బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ**

**తాళ్లపూడి జూన్ 13 సూర్య న్యూస్:** మండల పరిసర గ్రామాలైన పోచవరం, రాగోలపల్లి, తుపాకులగూడెం ప్రాంతాలకు చెందిన కొండల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ద్వారా వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా సిండికేట్‌గా ఏర్పడి రాత్రింబవళ్లు అక్రమ మైనింగ్ నిర్వహిస్తూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. కొండలపై ఉన్న జామాయిల్ సహా భారీ వృక్షాలను నిర్దాక్షిణ్యంగా తొలగించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలను ప్రశ్నించే వారిని బెదిరిస్తూ, ప్రాణహాని హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండల నుంచి తవ్విన గ్రావెల్, ఎర్రమట్టిని రోడ్ల చదునీకరణ పేరుతో అనుమతులు పొందినప్పటికీ, వాటిని అక్రమ లేఅవుట్లు మరియు వ్యవసాయ భూములకు విక్రయిస్తూ కొందరు దళారులు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట పడటం లేదని ఆయన విమర్శించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంకు దుర్గాప్రసాద్, తిరుమలశెట్టి కృష్ణ, మల్లిపూడి రాజేష్, కొండేపాటి శివకృష్ణ, తోట వెంకటరమణ, నున్న పోసయ్య, మద్దుకూరి అరుణ, ఇమ్మణి అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.





# 40 ఏళ్ల సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

**ఎంఈఓ సుబ్బారావు పదవీ విరమణ**

**తర్లపాడు జూన్ 13 సూర్య న్యూస్:** విద్యారంగంలోనాలుగుదశాబ్దాల పాటు నిరుపమానమైన సేవలు అందించిన మండల విద్యాశాఖ అధికారి అచ్యుత సుబ్బారావు



పదవీ విరమణ మహో త్సవం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అత్యంత వైభవంగా జరిగింది. దేవరకొండ సుజాత అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డిప్యూటీ డీఈఓ శ్రీనివాసుల రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి వక్తలు మాట్లాడుతూ అచ్యుత సుబ్బారావు గత40 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా,ప్రధానోపాధ్యాయుడిగా, విద్యాశాఖ అధికారిగా వివిధ హోదాల్లో అందించిన విశిష్ట సేవలనుకొనియాడారు. ఆయన నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలిచారని ప్రశంసించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు, తోటి ఉపాధ్యాయులకు నిరంతరం తగిన సూచనలు, సలహాలు ఇస్తూమండలంలోవిద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని అభినందించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారితో పాటు జిల్లాలోని పలువురువిద్యాశాఖఅధికారులు, ఉపాధ్యాయ లోకం అంతాకలిసిసుబ్బారావు–లక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. 1986 నుండి నేటి వరకు నా సుదీర్ఘ ప్రయాణంలో నాతో పాటు పనిచేసి, ప్రతి అడుగులోనూ నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, ఉపాధ్యాయ మిత్రులకునా హృదయపూర్వక ధన్యవాదాలు. అచ్యుత సుబ్బారావు, విశ్రాంత ఎంఈఓఈ విరమణ వేడుకల్లో సుబ్బారావు తన ఉదారతను చాటుకున్నారు. 2026 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రతి పాఠశాల పరిధిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పిలిపించి వేదికపై ఘనంగా సన్మానించారు. వారికి తన సొంత ఖర్చులతో ప్రోత్సాహక బహుమతులనుఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక కీలక ప్రకటన చేస్తూ.. కేవలం ఉద్యోగంలో ఉన్నప్పుడే కాకుండా, తన జీవితకాలం పాటు ప్రతి సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తన వంతుగా ఇలాగే ప్రోత్సాహక బహుమతులు అందిస్తూనే ఉంటానని స్పష్టం చేయడంతో సభలో చప్పట్ల వర్షం కురిసింది. ఈ కార్యక్రమంలో మండలపరిధిలోని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారితల్లిదండ్రులు మరియు విద్యా కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సుబ్బారావు కి శేష జీవితం ప్రశాంతంగా ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారుఈ కార్యక్రమం లో మండలం లోని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సూరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సులు
# నిబంధనల మేరకు నడపాలి

**మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్**


**నగరి జూన్ 13 సూర్య న్యూస్:** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వాసుదేవరెడ్డి సూచించారు. శనివారం పాఠశాలలకు సంబంధిత బస్సుల ఫిట్‌నెస్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలలు జూన్ 12 నుంచి పునఃప్రారంభం కావడంతో విద్యార్థులను రవాణా చేసే పాఠశాల బస్సులు, వ్యాన్లు, ఇతర వాహనాలు తప్పనిసరిగా రవాణా శాఖ నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యాలు తమ వాహనాలను ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచడంతో పాటు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భీమా, అనుమతి పత్రాలు తదితర పత్రాలు చెల్లుబాటులో ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఫిట్‌నెస్ గడువు ముగిసిన పాఠశాల బస్సులు వెంటనే ఫిట్‌నెస్ పునరుద్ధరించుకుని మాత్రమే విద్యార్థుల రవాణాకు వినియోగించాలని హెచ్చరించారు. అలాగే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, విద్యార్థుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల వేగ నియంత్రణ, అత్యవసర భద్రతా చర్యలు, ప్రథమ చికిత్స వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే వాహనాల పరిస్థితిని గమనించాలని, ఏవైనా లోపాలు లేదా భద్రతా సమస్యలు కనిపిస్తే వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యానికి తెలియజేయాలని కోరారు. 2026–27 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యాలను అందిస్తూ భద్రతా ప్రమాణాలను పాటిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# కలజువ్వలపాడు విద్యార్థి అద్భుత ప్రతిభ

**ట్రిపుల్ ఐటీ లోసీట్.సాధించిన దారెడ్డి వెలుగొండరెడ్డి**

**తర్లపాడు జూన్ 13 సూర్య న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులు నైపుణ్యానికి ఏమాత్రం తీసిపోరనితర్లుపాడుమండలం కలజువ్వలపాడు గ్రామానికి చెందిన విద్యార్థి నిరూపించాడు. మండల పరిధిలోని కలజువ్వలపాడు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదో తరగతి పూర్తి చేసిన దారెడ్డి వెలుగొండరెడ్డి ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించి రికార్డు సృష్టించాడు. వైఎస్ఆర్ కడప జిల్లా ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో ఈ విద్యార్థికి సీటు లభించింది. విద్యార్థి వెలుగొండరెడ్డి సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలకపాటి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థి అయిన వెలుగొండరెడ్డి పదో తరగతి ఫలితాల్లోఅత్యుత్తమ ప్రతిభ కనబరిచి, నేడు ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో సీటు దక్కించుకోవడం తమ పాఠశాలకే కాకుండా, తర్లుపాడు మండలానికే గర్వకారణమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ వల్లే ఇలాంటి ఫలితాలుసాధ్యమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కలజువ్వల పాడు గ్రామానికి చెందిన సాధారణ కుటుంబం నుండి వచ్చి, కఠిన శ్రమతో ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థిదారెడ్డివెలుగొండరెడ్డిని ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తోటి విద్యార్థులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.



## ఘనంగా మహిళల రోడ్డు భద్రత మరియు..
# గంజాయి వ్యతిరేక అవగాహన ర్యాలీ

**ముఖ్య అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం చేసిన ఎస్.ఐ కె.షరీఫ్**

**దేవీపట్నంజూన్ 13 సూర్య న్యూస్:** మహిళల రక్షణ, రోడ్డు భద్రతా నియమాల పాటించడం మరియు గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ కె.షరీఫ్ తెలిపారు. శనివారం ఇందుకూరుపేట గ్రామంలో దేవీపట్నం ఎస్.ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, యువతతో కలిసి భారీ అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ కె షరీఫ్ మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మూడు ప్రధాన అంశాలపై ఆయన ప్రజలకు దిశానిర్దేశం చేశారు.

**మహిళల భద్రత:** మహిళల రక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని.. వేధింపులకు గురైతే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని, 'దిశ' యాప్ వంటి సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. గంజాయి వినియోగం, రవాణా వల్ల యువత జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో వివరించారు. గంజాయి అలవాటు వల్ల కలిగే శారీరక, మానసిక, చట్టపరమైన నష్టాల గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం గ్రామంలోని ముఖ్య కూడళ్ల గుండా నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.



సూర్య



## గ్రంథాలయం మూసివేతపై

# అపోహలు వద్దు

**: మాజీ కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు**

**సూర్య వెలుగు కథనానికి స్పందన**

**సీతారామపురం జూన్ 13 సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయం మూసివేతను నిరసిస్తూ ఇటీవల పాఠకులు గ్రంథాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రంథాలయం మూసివేత ను ఖండిస్తూ నిరసన అనే శీర్షికతో సూర్య వెలుగు దినపత్రిక లో కథనం ప్రచురణ అయింది. అయితే ఈ విషయంను టిడిపి మండల మాజీ కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు నెల్లూరు జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ మేకపాటి శాంతకుమారి దృష్టికి తీసుకెళ్లగా సీతారామపురంలోని గ్రంథాలయం మూసివేతకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని సమన్వయ లోపం




సూర్య
12 Jun 2026 - Page 8
www.suryavelugu.com - 8985586689
గ్రంథాలయం మూసివేతను ఖండిస్తూ నిరసన

కారణంగా గ్రంథాలయం మూసి వేస్తున్నట్లు ప్రచారం జరిగిందని, గ్రంథాలయం మూసివేస్తున్నట్లు వస్తున్న ప్రచారాన్ని అపోహలను ప్రజలు నమ్మవద్దని గ్రంథాలయ చైర్పర్సన్ మేకపాటి శాంతకుమారి తెలిపినట్లు మాజీ కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు తెలిపారు. అతి త్వరలోనే మేకపాటి శాంతకుమారి సీతారామపురంలో పర్యటించి గ్రంథాలయానికి కావలసిన మౌలిక వసతులు, సదుపాయాలను అందించి గ్రంథాలయాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పాఠకులు ఎటువంటి ఆందోళన అపోహలు చెందవద్దని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా మూసివేసిన గ్రంథాలయాలను తెరిచి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చే విధంగా మేకపాటి శాంతకుమారి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వెంకటరత్నం లేని లోటు తీర్చలేనిది : యార్లగడ్డ

**మూల్పూరి కుమారుడ్ని ఫోన్లో పరామర్శించిన యార్లగడ్డ**

**గన్నవరం జూన్ 13 సూర్య న్యూస్ :** జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు మూల్పూరి వెంకటరత్నం ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు విచారం వ్యక్తం చేశారు. ఆరుగొలను గ్రామ మాజీ మనసబ్, టిడిపి నాయకులు మూల్పూరి వెంకటరత్నం శనివారం కన్నుమూశారు. వెంకటరత్నం మరణవార్త తెలిసిన వెంటనే అమెరికాలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు ఫోన్ చేసి వెంకటరత్నం కుమారుడు ప్రసాద్ ను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో వివిధ పదవులను సమర్ధవంతంగా నిర్వహించిన వెంకటరత్నం ఆకస్మిక మరణం బాధాకరమన్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షులుగాను, బాపులపాడు మండల పార్టీ అధ్యక్షులుగాను, అడ్ హాక్ కమిటీ సభ్యులుగాను విభిన్న హోదాల్లో పనిచేసిన ఆయన కడవరకు పార్టీ కోసం అంకితభావంతో, నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. మునసబ్లు గా పనిచేసిన వారిలో ఆఖరి తరం ఈయనే అయివుండొచ్చని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తన విజయం కోసం గట్టిగా కృషి చేసారని గుర్తుచేసుకున్నారు. ఇటీవల 90 వ పుట్టినరోజు వేడుక జరుపుకున్న వెంకటరత్నంను అదే వేడుకలో చివరిసారిగా కలిసానని అన్నారు. తాను అమెరికా వెళ్లేముందు వెంకటరత్నాన్ని చూడాలనిపించి ఫోన్ చేయగా హైదరాబాద్లో ఉన్నట్లు చెప్పారని అమెరికా నుండి వచ్చిన తరువాత చూసివద్దామనుకునేలోపు దేవుని వద్దకు వెళ్లిపోయారని పేర్కొన్న ఎమ్మెల్యే వెంకట్రావ్ ఫోన్లో మూల్పూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## హానికర ప్లాస్టిక్ వినియోగాన్ని

# అడ్డుకుందాం

**నగరి జూన్ 13 సూర్య న్యూస్:** హానికర ప్లాస్టిక్ వినియోగాన్ని అడ్డుకుందామని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రన్, అధ్యక్షులు లక్ష్మీపతి అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ప్రత్యేకసమావేశాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు మాట్లాడుతూ ఆరోగ్యంతో పాటు సామాజిక సేవలోను అసోసియేషన్ ముందుండాలని గత సమావేశాల్లో తీర్మానించడం జరిగిందన్నారు. ఆ మేరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని ప్రస్తుతం ప్రజారోగ్య రీత్యా హానికర ప్లాస్టిక్ వినియోగాన్ని అడ్డుకునేందుకు మనవంతు కృషిచేద్దామన్నారు. ముఖ్య కూడళ్లలో అసోసియేషన్ తరపున ప్లాస్టిక్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలను తెలుపుతూ ఫెక్సీలు ఏర్పాటుచేద్దామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే రోగాల గురించి అందరికీ తెలియజేద్దామన్నారు. ఇందుకు సభ్యులు ఏకాభిప్రాయంతో అంగీకరించారు. సమావేశంలో సామాజిక అంశాలపై పలు పుస్తకాలను తెలుగులో రచించిన ఉపాధ్యాయులు డాక్టర్ పురుషోత్తమాచారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ సోమసుందరం, కార్యదర్శి ఎం.రమేష్, సభ్యులు రాజవేలు, సుబ్రమణ్యం, మణి, రాజ, మనోహర్, భాస్కర్‌రాజు, మునికుమార్, దేవన్, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా ఐకాన్ అవార్డు గ్రహీత

# డాక్టర్ సురేష్ నాయుడుకు ఘన సన్మానం

**విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తానని హామీ...సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తానన్న డాక్టర్ సురేష్ నాయుడు**

**డోన్ జూన్ 13 సూర్య న్యూస్ :** ఇండియా ఐకాన్ అవార్డు అందుకుని జిల్లాకు, వాల్మీకి సమాజానికి గౌరవం తీసుకువచ్చిన మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ నాయుడుకు శనివారం స్థానిక వార్తా కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు, మిత్రులు,బంధువులు శాలువాలు పూలమాలలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ నాయుడు మాట్లాడుతూ తనకు లభించిన ఇండియా ఐకాన్ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా సమాజ సేవకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును కొనసాగించలేని విద్యార్థులకు తన వంతు సహాయం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. దాతల సహకారంతో పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించి వారి భవిష్యత్తుకు



బాటలు వేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తన సేవా కార్యక్రమాలకు నిరంతరం అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు,మిత్రులు,సంఘ నాయకులు మరియు శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య,సామాజిక సేవ,యువత అభివృద్ధి రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని వెల్లడించారు. ఇండియా ఐకాన్ అవార్డు సాధించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ, వాల్మీకి నాయకులు దిక్సూచి గౌరీశ్వర్ నాయుడు, అబ్బిరెడ్డి పల్లె గోవిందు,ఆర్మీ రామయ్య,దామోదర్ నాయుడు, నాగేంద్ర, వీఆర్వో మహానంది,టైలర్ మధు, హెచ్.కె.నాయుడు ఇంద్ర, టెంకాయల కేశవ్, కృష్ణ, కూరగాయల శివ, హీరో సురేష్,వడ్డె సంఘం నాయకులువిలేఖరి నాగరాజు,వడ్డే మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం

**యోగా పోటీలకు విశేష స్పందన -కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి**

**తిరుపతి జూన్ 13 సూర్య న్యూస్ :** యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం కచ్చపి ఆడిటోరియం లో నిర్వహించిన యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. యోగాంధ్ర - 2026 లో భాగంగా శనివారం కచ్చపి ఆడిటోరియంలో పలు విభాగాల్లో పోటీలను నిర్వహించిన పోటీలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య తో కలసి కమిషనర్ పరిశీలించారు. పలువురు యోగా గురువులు జడ్జిలుగా పాల్గొని యోగాలో ప్రతిభ కనపరిచిన వారిమి గుర్తించడం జరిగిందని తెలిపారు. జూనియర్స్, యంగర్స్, సీనియర్స్ మూడు కేటగిరిలుగా యోగా పోటీలు నిర్వహించామని తెలిపారు. వార్డు స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిస్తే రాష్ట్ర స్థాయిలో పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే లక్ష్యంతో ఈ యోగా పోటీలను నిర్వహిస్తున్నామని తెలుపారు. ఈ యోగా పోటీల్లో నగరపాలక సంస్థ రెవిన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, యోగా గురువులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## పశు వులను అక్రమంగా తరలిస్తున్న

# వాహనం నిందితులు అరెస్ట్

**నగరి జూన్ 13 సూర్య న్యూస్:** నింద్ర పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీ నీ సీజ్ చేసి డ్రైవర్ను అరెస్టు చేసినట్లు నింద్ర ఎస్సై మల్లికార్జున తెలిపారు ఆయన కథనం మేరకు జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు శనివారంవాహనాలను నగిరి రూరల్ సిఐ భాస్కర్ ఎస్ఐ లు తనిఖీ చేస్తుండగా నగరి నాగలాపురం రహదారిపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ ఏపీ 39 డబ్ల్యూ జే 96 48ను ఆపి తనిఖీ చేయగా అందులో 37 పశువులు (ఎద్దులు) అక్రమంగా తమిళనాడు కలైబారానికి తరలించి ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు అదేవిధంగా ఎలాంటి అనుమతి లేకుండా కంటైనర్ లారీలో తరలించడాన్నీ గుర్తించామని దీనిని గమనించిన లారీ డ్రైవర్ మరో వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపు లోకి తీసుకొని అరెస్టు చేయడం జరిగిందన్నారు 37 ఎద్దులు అక్రమ రవాణాకు వినియోగించిన కంటైనర్ లారీ తో పాటు రూపాయలు రెండు వేల నగదును స్వాధీనం చేసుకుని నిందితులపై అనిమల్స్ యాక్ట్ 1960 మరియు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు

# బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలి

**: ఈఆర్‌వో శారదా దేవి**

**తిరుపతి జూన్ 13 సూర్య న్యూస్:** 167-తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)



పూర్తి సహకారం అందించాలని నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో) శారదా దేవి పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026' కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరం, లక్ష్యాలు, అమలు విధానం, ప్రస్తుతం కొనసాగుతున్న ఎలక్టోరల్ మ్యాపింగ్, ఎస్ఐఆర్ షెడ్యూల్, గణన (ఎన్యూమరేషన్) ప్రక్రియ తదితర అంశాలను అధికారులు వివరించారు. అలాగే ఓటర్ల జాబితా సవరణలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల నియామక వివరాలను నిర్దేశిత నమూనాలో రెండు రోజుల్లోగా కార్యాలయానికి సమర్పించాలని ఈఆర్‌వో సూచించారు. ప్రస్తుత ఓటర్ల తాజా పాస్‌పోర్ట్ సైజు రంగు ఫొటోలను సేకరించి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) అందజేయాలని కోరారు. సమావేశం అనంతరం ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన పలు సందేహాలను బూత్ లెవల్ ఏజెంట్లు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిపై అధికారులు సమగ్ర వివరణ ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌వోలు) అమరయ్య, వి. సురేష్‌బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ సుధాకర్ నాయక్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.



# అభివృద్ధి-సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**: పాలకవీటి విజయకుమార్**

**కర్నూలు జూన్ 13 సూర్య న్యూస్:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ అన్నారు. కర్నూలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు కృష్ణాజీరావు, రాంబాబు మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అపారమైన మద్దతుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. 'శ్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించగా 71 కోట్లకు పైగా ప్రయాణాలు నమోదయ్యాయని వివరించారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.8,985 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మామిడి, కోకో, ఉల్లి రైతులకు రూ.1,100 కోట్ల సాయం అందించామని, భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పోలవరం నిర్వాసితులకు రూ.2,250 కోట్ల సహాయం అందించామని పేర్కొన్నారు. హంద్రీ-నీవా, చింతల పూడి, నేరేడు, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వాటి కోసం రూ.25 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20,060 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం చేపట్టి గుంతల రహిత రహదారుల లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అమరావతి రాజధాని అభివృద్ధి, పోర్టులు, హైవేలు, విమానాశ్రయాలు, రైల్వే ప్రాజెక్టులు, డేటా సెంటర్లు, సెమీకండక్టర్ పరిశ్రమలు, ఏఐ హబ్, క్వాంటం వ్యాలీ వంటి ప్రాజెక్టులు రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తున్నాయని అన్నారు. యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ 15,491 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులతో పాటు మొత్తం 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలను మరింత చేరువ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

## గోదావరి నదిలో పర్యాటక బోట్ల సేవలు
# తాత్కాలికంగా నిలిపివేత

**భద్రతా ప్రమాణాల పరిశీలన అనంతరమే అనుమతులు ఆర్డీవో కె. స్వాతి**

**రంపచోడవరం జూన్ 13 సూర్య న్యూస్:** గోదావరి నదిలో నిర్వహిస్తున్న పర్యాటక బోట్ల నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు, భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న



నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గోదావరి నదిలో నడుస్తున్న అన్ని పర్యాటక బోట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. బోట్ల ఫిట్‌నెస్, సాంకేతిక పరిస్థితి, ప్రయాణికుల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, లైఫ్ జాకెట్లు, అత్యవసర రక్షణ పరికరాలు, బోట్ యాజమాన్యాలు పర్యాటకుల భద్రత కోసం తీసుకున్న చర్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీసు, పర్యాటక, మత్స్యశాఖ, విపత్తు నిర్వహణ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. బృందం నివేదిక ఆధారంగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారణ అయిన అనంతరమే సంబంధిత బోట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని, తనిఖీలు పూర్తయ్యే వరకు గోదావరి నదిలో పర్యాటక బోట్లను నడపరాదని బోట్ యాజమాన్యాలను ఆర్డీవో స్వాతి హెచ్చరించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

### ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్పిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా కృష్ణయ్య

**నగరి జూన్ 13 సూర్య న్యూస్:** నింద్ర ఉమ్మడి చిత్తూరు జిల్లా రాయల్ పీపుల్ ఫ్రెంట్ ఆర్ పి ఎఫ్ కమిటీ సంఘ గౌరవ అధ్యక్షుడిగా నింద్ర మండలం కావునూరుకు చెందిన




కృష్ణయ్యను ఎన్నుకున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రాయల్ తెలిపారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో నన్ను జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో నా వంతు సహాయ సహకారాలు అందించిఅందరికీ. సంఘానికి న్యాయం చేస్తానని తెలిపారు తనకి పదవ రావడానికి కృషిచేసిన జాతీయ కాపు సంఘ కమిటీ ప్రచార కార్యదర్శి పుత్తూరుకు చెందిన బలిజ సంఘ సీనియర్ నాయకుడు గోపిరాయలకు. కృతజ్ఞతలు. తెలిపారు.

# అభ్యంతరాలు ఉంటే తెలపండి

**ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి**







**శ్రీకాళహస్తి జూన్ 13 సూర్య న్యూస్:** శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ నమోదు, ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రాజకీయ వామపక్ష పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బి ఎల్ వోలు 15-06-2026 నుంచి 14-07-2026 వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ నమోదు ప్రక్రియ చేపడతారని, అర్హులైన ఓటర్లు ఫారాలు పూర్తిచేసి సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 21 లోపు తెలియ పరచాలని, సెప్టెంబర్ 22 కు తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి జనసేన నాయకుడు దండి నరేంద్ర తో పాటు జనసేన నాయకులు, శ్రీకాళహస్తి బిజెపి మండల అధ్యక్షుడు బాగిర్తి వెంకటేష్ , ఇతర బిజెపి నాయకులు ,తెలుగుదేశం నాయకులు , వైఎస్ఆర్సిపి నాయకులు, ఇతర వామపక్ష నాయకులు తదితరులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాధవరం ఘటన నేపథ్యంలో కొనసాగుతున్న
# పోలీస్ బందోబస్తు

**మంత్రాలయం జూన్ 13 సూర్య న్యూస్ :** మండలం లోని మాధవరం గ్రామంలో శుక్రవారం వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ



నేపథ్యంలో మండలంలోని మాధవరం, బసాపురం, బూదూరు గ్రామాల్లో ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 50 మంది సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ బలగాలతో మూడు గ్రామాల్లో పికెటింగ్ నిర్వహించారు. ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పహారాతో పాటు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు అపోహలకు పోకుండా, శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు. రెండు పార్టీల నాయకులు కార్యకర్తలకు సంయమనం పాటించేలా సూచించాలన్నారు. ప్రస్తుతం మూడు గ్రామాల్లో పరిస్థితి అదుపులో ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

# జేగురుపాడులో కార్డన్ అండ్ సెర్చ్

**12 బైక్‌లు స్వాధీనం.. బెల్ట్ షాపుపై దాడి**







**రాజమహేంద్రవరం జూన్ 13 సూర్య న్యూస్:** జిల్లా లోని కడియం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేగురుపాడు గ్రామం పాములమెట్ట కాలనీలో శనివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కడియం ఇన్‌స్పెక్టర్ ఏ.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో రికార్డులు లేని 12 ద్విచక్ర వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అదే సమయంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్న బెల్ట్ షాపుపై దాడి చేసి 35 క్వార్టర్ డీపీఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆపరేషన్ సందర్భంగా కాలనీలోని కొత్త, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగ దుర్గాప్రసాద్, ఈగల్ టీమ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏర్పేడు మండలంలో దోమల బెడద..!

**రాజుల కండ్రిగ స్కూల్ విద్యార్థుల అవస్థలు**

**శ్రీకాళహస్తి జూన్ 13 సూర్య న్యూస్:** నియోజకవర్గం లోని ఏర్పేడు మండలం రాజులకండ్రిగ గ్రామంలోని ఆదర్శ పాఠశాల మరియు గ్రామ పరిసరాల్లో దోమల బెడద



తీవ్రంగా ఉందని గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలో ఉన్న కాలువలో మురుగునీరు నిలిచిపోయి, పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. పాఠశాల ప్రక్కనే మురుగు కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీరు నిల్వ ఉంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి.పగటిపూట కూడా దోమలు కుడుతుండటంతో విద్యార్థులు పాఠాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు, మండల విద్యాశాఖ అధికారులకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వెంటనే కాలువను శుభ్రం చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

## గోసంరక్షణ సమాజ శ్రేయస్సుకు,
# ధర్మ పరిరక్షణకు పునాది

**-తితిదే డాక్టర్ మల్లు వేంకటరెడ్డి**

**గూడూరు జూన్ 13సూర్య న్యూస్ :** భారతీయ సంస్కృతిలో గో సంరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ఆర్థిక, వ్యవసాయ, ఆధ్యాత్మిక జీవన విధానాలకు ఆధారంగా





భావించబడుతున్న గోసంరక్షణ ద్వారా వ్యవసాయం బలోపేతమవడమే కాకుండా ప్రకృతి సమతుల్యత పరిరక్షించ బడుతుందని అందువల్ల గోసంరక్షణ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, సమాజ శ్రేయస్సుకు మరియు ధర్మ పరిరక్షణకు పునాదిఅని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గూడూరు మండలం, వై. కానాపూర్ గ్రామంలోని శివాలయంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులు డమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో పూజారి మద్దిలేటి,సత్సంగసభ్యులు యు.ఈరన్న,యు.చిన్నరాముడు, చదువులన్న, జయరాములు, రామాంజనేయులుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటి కి మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

**రుద్రవరం జూన్ 13 సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బండి గౌరీ ప్రతిభ కనబరిచి ట్రిబుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్ లో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది అని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు ఒక ప్రకటన లో శనివారం తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం మరియు విద్యార్థిని కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది,గ్రామ పెద్దలు బండి గౌరీని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



అలాగే ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.బండి గౌరీ సాధించిన ఈ ఘనతకు ఆమె తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థిని ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గతం సంవత్సరం ముగ్గురు కి వచ్చింది అని అన్నారు.కృషి ఉంటే విజయం సొంతం అవుతుంది అనే నానుడికి బండి గౌరీ విజయం నిదర్శనం అని ప్రిన్సిపాల్ అన్నారు.

## రఘుదేవపురంలో పోలీసుల
# అవగాహన సదస్సు

**మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై చైతన్యం**

**తూర్పుగోదావరి/ సీతానగరం జూన్ 13 సూర్య న్యూస్:** సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రఘుదేవపురం గ్రామ పంచాయతీలో శనివారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించి





మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ డీఎస్పీ సీహెచ్ జీవన్ మార్గదర్శకత్వంలో, కోరుకొండ సీఐ ఎస్‌వీబీఎస్ మూర్తి సూచనలతో నూతన ఎస్ఐ ఎల్. శ్రీను నాయక్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు, యువత, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్ఐ శ్రీను నాయక్ మహిళల సంక్షేమం, భద్రత, చట్టపరమైన రక్షణ అంశాలపై వివరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసాలకు గురైన సందర్భంలో వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పోలీస్-ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని ఎస్ఐ ఎల్. శ్రీను నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

# డాక్టర్ మాచర్ల మోహన్‌రావుపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ**

**పొదలకూరు జూన్ 13 సూర్య న్యూస్:** చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహన్‌రావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ (నెల్లూరు జిల్లా) డిమాండ్ చేసింది.ఈ మేరకు పట్టణంలోని రమణారెడ్డి కాలనీలో ఉన్న కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు తీర్మానం చేశారు.సమావేశంలో నాయకులు మాట్లాడుతూ చీరాలలోని సిదూర్ కాలనీలో చేనేత కార్మికుల భూములను కబ్జా చేస్తున్న భూకబ్జాదారులను అడ్డుకున్నందుకే డాక్టర్ మాచర్ల మోహన్‌రావుపై దాడి జరిగిందని ఆరోపించారు. 1992లో సిదూర్ సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులైన 300 చేనేత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభించగా, 1998 నాటికి 200 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. చేనేత కార్మికుల శిక్షణ, సామాజిక అవసరాల కోసం కేటాయించిన 1.86 సెంట్ల భూమి మరియు భవనాన్ని



కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయాన్ని డాక్టర్ మోహన్‌రావు వెలుగులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు.జూన్ 6న కోర్టు ఆదేశాల మేరకు అడ్వకేట్ కమిషనర్, ప్రభుత్వ సర్వేయర్ ఆధ్వర్యంలో భూమి కొలతలు జరుగుతుండగా, అక్కడికి చేరుకున్న మోహన్‌రావుపై భూఆక్రమణదారులు ఇనుప రాడ్లతో ప్రాణాంతక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.ఈ సందర్భంగా కమిటీ పలు డిమాండ్లు చేసింది. దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అనుచరులపై హత్యాయత్నం (ఐపీసీ 307) కేసు నమోదు చేయాలని, మోహన్‌రావు తదితరులపై నమోదు చేసిన అక్రమ ఎస్సీ, ఎస్టీ కేసులను వెంటనే రద్దు చేయాలని కోరింది. అలాగే చేనేత కార్మికుల శిక్షణ కోసం నిర్మించిన భవనాన్ని పునర్నిర్మించాలని, భూకబ్జాలు మరియు ల్యాండ్ మాఫియా కార్యకలాపాలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో చేనేత సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు, పముజుల హరి, పముజుల శంకరయ్య, చేనేత సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం,పూకోటి లక్ష్మీనారాయణ, బత్తూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం 14 జూన్, 2026

## రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న
# ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి

**మంత్రాలయం జూన్ 13 సూర్య న్యూస్ :** ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి శనివారం ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠానికి విచ్చేసిన ఆయనకు మఠం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. అనిల్ రావిపూడి ముందుగా గ్రామ దేవత శ్రీ మంచాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన చేసి, మంగళహారతులు సమర్పించారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని విశేష పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. మఠం అధికారులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ "నా ప్రతి సినిమా విజయం వెనుక గురురాఘవేంద్ర స్వామి ఆశీస్సులు ఉన్నాయి. కష్టకాలంలో స్వామిని తలచుకుంటే ధైర్యం వస్తుంది. మంత్రాలయానికి వచ్చిన ప్రతిసారీ మనసుకు ఎంతో ప్రశాంతత, సానుకూల శక్తి లభిస్తుంది. ఆయన వెంట సినీ నిర్మాతలు, స్థానిక ప్రముఖులు పలువురు ఉన్నారు.



## ట్రిపుల్ ఐటీలో మెరిసిన
# కేవీబీపురం విద్యార్థులు

**కేవీబీపురం జూన్ 13 సూర్య న్యూస్:** పదో తరగతి ఉతిర్ణతలో ము రిసిన కేవీబీపురం విద్యార్థులు మళ్ళీట్రిపుల్ఐటీలోమెరిసారు. పేదరికం నుండి వచ్చిన ఈ ఆణిముత్యాలు ఒంగోలు ట్రి పుల్ ఐటీ కళాశాలలో సీట్లు సాధించి మండలానికి గర్వకా రణంగా నిలిచారు. మండలం లోని మర్రిగుంట గ్రామానికి చెందిన సుధాకర్, అముదా కుమార్తె భవ్యశ్రీ రాగి గుంట పాఠశాలలో ఈ ఏడాది పది పూర్తి చేసింది. ట్రిపుల్ఐటీకి రాసిన మొదటిప్రయత్నంలోనే సీటు సాధించింది. ఈ విద్యార్థి కి మండల విద్యాశాఖ అధికా రులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



## గాయపడిన వైసీపీ కార్యకర్తలను పరామర్శించిన
# జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి

**మంత్రాలయం జూన్ 13 సూర్య న్యూస్:** మండలం లోని మాధవరం గ్రామంలో జరిగిన ఘర్షణలో గాయపడిన వైసీపీ కార్యకర్తలను జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే కె.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూజారి ఈరన్న, గొల్ల ఆంజనప్ప, గొల్ల రాముడులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రదీప్ రెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఘటనకు కారణమైన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సబ్సిడీ వేరుశనగ పక్కదారి పట్టిస్తే...
# కఠిన చర్యలు

**రామగిరిలో విత్తన పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత**

**రామగిరి :** రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తన వేరుశనగను ఎవరైనా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. రామగిరి మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి సుమారు 13 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించగా, ప్రస్తుతం 5 వేల క్వింటాళ్ల వరకు నిల్వలు అందు బాటులోకి వచ్చాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని, రైతుల అవస రాలకు అనుగుణంగా మరింత విత్తనం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక బస్తా విత్తన ధర రూ.3,036 కాగా, ఇందులో రూ.1,224 సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు కేవలం రూ.1,836 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఒక్కో రైతుకు మూడు బస్తాల చొప్పున విత్తనం అందజేస్తుండటంతో ప్రభుత్వం ప్రతి రైతుకు సుమారు రూ.3,672 మేర సబ్సిడీ కల్పిస్తోందన్నారు. విత్తనం తీసుకునే సమయంలో రైతులు నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సబ్సిడీ విత్తనాలను అక్రమంగా విక్రయించడం లేదా దుర్వినియోగం చేయడం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయంలో వైవిధ్యం అవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులు వేరుశనగతో పాటు నవ ధాన్యాల సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్య పరంగా నవధాన్యాల వినియోగం పెరుగుతోందని, వాటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు.

**ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యల స్వీకరణ...** అనంతరం రామగిరి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న రామగిరికి చెందిన ముత్యాలప్పను ఆయన నివాసంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రౌడీ రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారు: గుడిసె కృష్ణమ్మ

**మంత్రాలయం జూన్ 13 సూర్య న్యూస్:** మంత్రాలయం టీడీపీ ఇంచార్జి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడారు. నిన్న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో బైక్‌లపై వచ్చి రెచ్చగొట్టడం, కార్యకర్తలపై దాడి చేయడం ఖండనీయమని అన్నారు. అల్లర్లు సృష్టించడం గొడ్డలి పార్టీకి అలవాటుగా మారిందని విమర్శించారు. కార్యకర్తలు సంయమనం పాటించాలని, ప్రత్యర్థుల ప్రేరేపణలకు లోనుకావద్దని సూచించారు. 44 ఏళ్లుగా



టీడీపీ క్రమశిక్షణకు మారుపేరని, సీఎం అభివృద్ధి, సంక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో శాంతిభద్రతలు, అభివృద్ధి సమర్థవంతంగా సాగుతున్నా యన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అభివృద్ధి కోరుకుం టున్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాలను ప్రజలు గుర్తించి గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీకి ఎంపికైన వేంపల్లె...
# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**వేంపల్లె జూన్ 13 సూర్య న్యూస్ :** ఇడుపులపాయ ఆర్‌జీయూకేటీ - త్రిబుల్ ఐటీ క్యాంపస్‌కు వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.







నందిబత్తిని శివకేశవ 575 మార్కులతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కి , ఎక్కలూరు పూజ( 587 మార్కులు), ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కి, బి. పావని (574 మార్కులు) ఒంగోలు త్రిబుల్ ఐటీ కి ఎంపికయ్యారు. ఆర్‌జీయూకేటీ 2026-27 విద్యా సంవత్సరానికి విడుదల చేసిన ప్రొవిజనల్ జాబితాలో వీరు ఎంపికైనట్లు ఆ పాఠశాల వర్గాలు తెలిపాయి. త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఆయా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో త్రిబుల్ ఐటీ సీటు సాధించడం పాఠశాలకే గర్వకారణమని వారు పేర్కొన్నారు. వీరు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## బీజాపురి టౌన్‌షిప్‌లో బీటీ రోడ్డుకు
# శంకుస్థాపన

**రూ.65 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**కూటమి నాయకుల చేతుల మీదుగా కార్యక్రమం**

**తూర్పుగోదావరి /రాజానగరం జూన్ 13సూర్య న్యూస్:** నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దివాన్‌చెరువు గ్రామ పరిధిలోని బీజాపురి టౌన్‌షిప్‌లో హైవే రోడ్డు నుంచి లోపలికి నిర్మించనున్న బీటీ రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులతో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణానికి ఎన్డీఏ కూటమి నాయకులు శంకు స్థాపన చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు. కూటమి విజయానికి కృషి చేసిన నాయకులకు గౌరవం, గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతో వారిచేత శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం ఎమ్మెల్యే వినూత్న ఆలోచనగా నాయకులు పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణంతో టౌన్‌షిప్ నివాసితులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.





# గర్భిణి మృతిపై అనుమానాలు..!

**రెండు నెలల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘటన**

**పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి రీ-పోస్ట్‌మార్టం**

**తూర్పుగోదావరి/ సీతానగరం జూన్ 13సూర్య న్యూస్:** మండలం లోని కూనవరం గ్రామంలో ఎనిమిది నెలల గర్భిణి మృతి ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. రెండు నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు భావించిన మహిళ మరణంపై తాజాగా అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన దుర్గా భవాని (గర్భిణి) రెండు నెలల క్రితం మృతి చెందగా, అనారోగ్యంతోనే మరణించిందని కుటుంబ సభ్యులు భావించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆమె మరణానికి ముందు భర్త కుమార్‌తో తరచూ గొడవలు జరిగేవని దీనికి సంబంధించిన ఆడియో కాల్స్ ఇటీవల బయటపడినట్లు సమాచారం. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు భర్తపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై లోతుగా విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అధికారుల సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి రీ-పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా మృతికి గల అసలు కారణాలను నిర్ధారించనున్నట్లు పోలీసులు తెలిపారు. గర్భిణి మృతి వెనుక ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయా, కుటుంబ కలహాలు కారణమయ్యాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రీ-పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన కూనవరం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.




## గ్రామస్థాయి నుంచే వినియోగదారుల
# చైతన్యం లక్ష్యం

**ప్రతి మండలంలో వినియోగదారుల సేవా సంఘాల ఏర్పాటు**

**రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్**


**పుట్టపర్తి :** గ్రామస్థాయి నుంచి వినియోగదారులను చైతన్యవంతులను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. శనివారం శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ఓ స్థానిక హోటల్‌లో బుక్కపట్నం మండల వినియోగదారుల సేవా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయిలో వినియోగదారులు ఏవైనా సమస్యలు లేదా నష్టాలను ఎదుర్కొంటే మండల వినియో గదారుల సేవా సంఘాన్ని ఆశ్రయించి పరిష్కారం పొందవచ్చని చెప్పారు. వినియోగ దారుల హక్కుల పరిరక్షణ, అవగాహన కల్పన, సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో వినియోగదారుల సేవా సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా బుక్కపట్నం మండల వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడిగా ఎం. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆకుల చిన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీగా కె. వెంకటలక్ష్మి, కోశాధికారిగా విష్ణును ఎంపిక చేశారు. అలాగే మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.



## పేద ప్రజల కుటుంబాలకు ముఖ్యమంత్రి...
# నారా చంద్రబాబునాయుడు పెద్దదిక్కుగా నిలిచారు

**మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు**

**వరికుంటపాడు జూన్ 13 సూర్య న్యూస్ :** రాష్ట్రంలోని పేద ప్రజల కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దదిక్కుగా నిలిచారాని టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు అన్నారు. వరికుంటపాడు మండలంలోని తోటల చెరువుపల్లి గ్రామానికి చెందిన పత్తి లక్ష్మమ్మ కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం 72113 రూపాయలు, పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొత్తులూరి జ్యోతి కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం 70462 రూపాయలు, చంద్ర నరసింహులు వైద్య ఖర్చుల నిమిత్తం 94380 రూపాయలు, కాలే రమణమ్మ వైద్య ఖర్చులు నిమిత్తం , దుగ్గుంట పద్మ వైద్య ఖర్చుల నిమిత్తం 103676 రూపాయల సీఎం సహాయనిది చెక్కులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు బాధితులకు టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు



అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతోమంది నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయత నిధి నుంచి ఆదుకుంటూ వారి జీవితాలలో వెలుగులు నిప్పుతున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో శాసనసభ్యులు కాకర్ల సురేష్ నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం లో ఏ ఒక్కరికి ఆరోగ్యం బాగా లేకపోయినా తాను ముందుండి సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాదెండ్ల రాజా, తెల్లగొర్ల వెంకటయ్య, ఆరికొండ వెంకటరత్నం, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే లక్ష్యంగా సుజనా ఫౌండేషన్

**సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు**

**విజయవాడ జూన్ 13 సూర్య న్యూస్ :** పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి,సుజనా ఫౌండేషన్ ద్వారా ప్రారంభించిన ఉచిత మెగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుంది.పశ్చిమ లోని పేద,మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరంతరం ఉచితంగా అందించేందుకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేపడుతున్నారు.. ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా హెచ్.బీ కాలనీలో శనివారం ప్రారంభించిన ఉచిత వైద్య శిబిరాలను పశ్చిమ ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ ఆరోగ్య శిబిరంలో పూర్తిగా ఉచితంగా బీపీ,షుగర్, ఈసీజీ, ఎక్స్ రే , వంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసిన్,డెంటల్, కంటి పరీక్షలు, వంటి అనేక అనారోగ్యాలపై 130 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించారు. అవసరమైన వారికి అక్కడికక్కడే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు.దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభించింది.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో , సుజనా ఫౌండేషన్ ద్వారా వారాంతంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ కామినేని అచ్యుతరామయ్య, డాక్టర్ దిలీప్ ( జనరల్ మెడిసిన్ ) శంకర నేత్ర చికిత్సలయం డాక్టర్ వీర్ల అంకమ్మ, డాక్టర్ అశ్విత, గవర్నమెంట్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్స్, మరియు టెక్నీషియన్స్ అనిల్, సంతోష్, మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య, పత్తి నాగేశ్వరరావు, కూటమి నేతలు తిరుపతి అనూష, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, అల్లంకి శ్రీనివాస్ , జయబాలన్, సుజనా ఫౌండేషన్ సిబ్బంది హరీష్,సుజనా మిత్రా కోఆర్డినేటర్లు ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందించారు.





# అభివృద్ధి పనులనే ప్రజలు ఆదరిస్తారు

**: ఏఎంసీ చైర్మన్ జి.ఎం. రాజు**

**కుప్పం టౌన్ జూన్ 13 సూర్య న్యూస్:** శెట్టిపల్లి నుండి కంచి బందార్లపల్లి వరకు రూ.60 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం అభివృద్ధికి నిదర్శనమని ఏఎంసీ చైర్మన్ జి.ఎం. రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయలేదన్న ఏఎంసి చైర్మన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను గుర్తించి శెట్టిపల్లి -- కంచిబందార్లపల్లి మార్గాన్ని నూతన తారు రహదారిగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలే నిజమైన రాజకీయాలుగా నిలుస్తాయని, అలాంటి పనులను ప్రజలు ఎప్పుడూ స్వాగతిస్తారని తెలిపారు. అభివృద్ధి పనులను పక్కనపెట్టి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేయడం వల్ల ప్రజల్లో ఆదరణ లభించదన్నారు. ప్రజలు రాజకీయ పార్టీల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని, ఎవరు అభివృద్ధి చేస్తున్నారు, ఎవరు అడ్డంకులు సృష్టిస్తున్నారు అన్న విషయాలను స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల తీర్పే అంతిమమని, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేసే నాయకులనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.



## ఏజెన్సీ గ్రామాల్లో యూరియా యాప్
# వినియోగంపై అవగాహన

**జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర**

**మహబూబాబాద్ జూన్ 13 సూర్య న్యూస్:** జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ చంద్ర,మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి బయ్యారం మండలంలోని కొత్తపేట నుండి మిర్యాలపెంట వరకు ఏజెన్సీ గ్రామాలను సందర్శించి, రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యూరియా యాప్ పనితీరును పరిశీలించి, రైతులకు యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం, దాని ప్రయోజనాలు, పారదర్శకత గురించి రైతులకు వివరించారు. అల్లిగూడెం, పందిపంపుల గ్రామాలలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యూరియా యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు.యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని,ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.అనంతరం అల్లిగూడెం గ్రామ సర్పంచ్ చింత ప్రసాద్ తో సమావేశమై గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.పంటల వైవిధ్యీకరణలో భాగంగా రానున్న వానాకాలంలో మొక్కజొన్న సాగు నుండి ఆయిల్ పామ్ సాగుకు మారేందుకు ముందుకు వచ్చిన రైతులు అవిరె నారాయణ, మురళీకృష్ణ తదితరులను జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఇతర రైతులు కూడా అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పంట అవశేషాల దహనం వల్ల నేల సారం తగ్గిపోవడం, పర్యావరణ కాలుష్యం పెరగడం, భూసార జీవులు నశించడం వంటి దుష్పరిణామాలను రైతులకు వివరించారు.అదేవిధంగా పంటల వైవిధ్యీకరణ అవసరాన్ని నొక్కి చెబుతూ,నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.యూరియా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను అవలంబించాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు ,ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





# యోగాసనాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి: కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**యోగాంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లక్ష్యం...ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది**

**విజయవాడ జూన్ 13 సూర్య న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడ భవానిపురంలోని బెరం పార్కులో నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ కమిషనర్ గోపాలకృష్ణ, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర ఒక ఉద్యమంలా రూపుదిద్దుకుని ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా సానుకూల దృక్పథం పెంపొందుతుందని చెప్పారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎన్టీఆర్ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఆయుష్ శాఖ రూపొందించిన కామన్ యోగా ప్రోటోకాల్‌లోని ఆసనాలు ప్రతి ఒక్కరూ సులభంగా చేయగలరని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు యోగా చేయవచ్చని పేర్కొన్నారు. రోజుకు 40 నుంచి 45 నిమిషాలు యోగాకు కేటాయిస్తే శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందని అన్నారు.ప్రస్తుతం పెరుగుతున్న ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్ వంటి జీవనశైలి సంబంధిత సమస్యలను నివారించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు, పనిలో సామర్థ్య వృద్ధి, జీవితంలో సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని పిలుపునిచ్చారు.యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, శిక్షకులు, విద్యాసంస్థలు, పౌర సమాజ ప్రతినిధులు మరియు ప్రజలకు కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా. జె. ఇందుమతి, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప,డీఆర్‌డీఏ పీడీ ఎన్.వి. నాంచారరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కె. రమేష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దుత్తలూరులో
# మెగా రక్తదాన శిబిరం

**ఉదయగిరి జూన్ 14 సూర్య న్యూస్:** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వ భారతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుత్తలూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం ప్రారంభమయ్యే ఈ శిబిరం రోజంతా కొనసాగనుంది.సమాజ సేవే ధ్యేయంగా పనిచేస్తున్న విశ్వ భారతి సేవా సంస్థ, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన రోగులకు సకాలంలో రక్తం అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, రక్తహీనత వంటి సందర్భాల్లో రక్తం అత్యంత అవసరమవుతుందని, స్వచ్ఛంద రక్తదాతల సహకారంతో అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్. పుల్లారెడ్డి మాట్లాడుతూ, రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి అమూల్యమైన సేవ అందించగలరని అన్నారు. యువత, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.రక్తదానం చేయడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఒక యూనిట్ రక్తదానం ద్వారా ముగ్గురు వరకు రోగులకు సహాయం చేసే అవకాశం ఉందని తెలిపారు.ఒక చుక్క రక్తం.. ఒక ప్రాణానికి ఆశాకిరణం రక్తదానం -- మహాదానం అనే నినాదాలతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో అర్హులైన రక్తదాతలందరూ పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఎన్. పుల్లారెడ్డి (94936 66279, 98495 25950)ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిపై ట్రైనీ ఐఏఎస్ అధికారుల అధ్యయనం

**వరదయ్యపాలెం జూన్ 13 సూర్య న్యూస్:** ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పరిసర ప్రాంతాలు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ మొండెలెజ్ పరిశ్రమను సందర్శించిన అధికారులు, ఉత్పత్తి ప్రక్రియలు, ఆధునిక సాంకేతికత వినియోగం,నాణ్యత ప్రమాణాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన పొందారు. పారిశ్రామిక రంగంలో శ్రీసిటీ సాధిస్తున్న ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనపై అధికారులు ఆసక్తి కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు.




## 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడిని ఓటరుగా
# నమోదు చేయడం మన బాధ్యత

**బూత్ స్థాయి కమిటీలే పార్టీ బలోపేతానికి అసలైన బలం - జీనుమణి బాబు**

**జగ్గంపేట జూన్ 13 సూర్య న్యూస్:** మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్లస్టర్, కో-క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బీఎల్ఏలకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. మండల అధ్యక్షుడు జీనుమణి బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా ఎస్‌విఎస్ అప్పలరాజు, కుంచె రాజా, కందుల చిట్టిబాబు, రేఖ బుల్లిరాజు, బొల్లారెడ్డి రామ కృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిలాంటిదని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, మరణించిన వారి ఓట్ల తొలగింపు వంటి అంశాలపై బూత్ స్థాయి కమిటీలకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి బూత్ ఏజెంట్ క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని సూచించారు. మండల అధ్యక్షుడు జీనుమణి బాబు మాట్లాడుతూ, “బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటేనే ప్రజల నిజమైన తీర్పు ప్రతిబింబిస్తుంది. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతను ఓటరుగా నమోదు చేయించడం మన తొలి బాధ్యత. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ వ్యవస్థను గౌరవిస్తూ ప్రతి కార్యకర్త పనిచేయాలి.బూత్ స్థాయి కమిటీలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తల అనుభవాన్ని బూత్ స్థాయిలో వినియోగించుకోవాలని, ప్రతి ఓటు విలువైనదనే భావనతో కార్యకర్తలు పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, అడబాల వెంకటేశ్వరరావు,పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ముంద్రు ఎర్రబాబు, మూసిరెడ్డి నాగేశ్వరరావు, గెద్దాడ సత్యవేణి, పిలా మహేష్, నండ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.





# వర్షాన్ని సైతం లెక్కచేయలే వాడపల్లి వెంకన్న భక్తులు

**స్వామివారిని దర్శించుకున్న డాన్స్ శేఖర్ మాస్టర్**

**భారీ వర్షంలో తరలివచ్చిన లక్షల్లో భక్తులు - ఎక్కడకక్కడ ట్రాఫిక్ జామ్**


**భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శ్రమించి ట్రాఫిక్ క్లియర్ చేసిన ఆలయ, పోలీసు సిబ్బంది**







**కోనసీమ/ఆత్రేయపురం జూన్ 13 సూర్య న్యూస్:** అపారమైన భక్తి విశ్వాసాలతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కోనసీమ తిరుమల గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో శనివారం తరలివచ్చారు. తెల్లవారుజామునే మూడు గంటలకు మొదలైన వర్షం పిడుగుల మెరుపులతో అతి భారీ వర్షం గా మారింది. ఇంత వర్షం వస్తున్న భక్తులు మాత్రం వారి భక్తులు చాటుకునేలా ఆ వర్షంలోనే ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా ఏడు వారాల వ్రతం ఆచరించే భక్తులు, ప్రతి శనివారం వాతావరణం ఎలా ఉన్నా. స్వామివారి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంతటి భక్తి ఆ భక్తుల అచంచల విశ్వాసం విశిష్టత,ఏడు వారాల దీక్ష,తమ కోరికలు నెరవేరాలని కోరుకుంటూ భక్తులు వరుసగా ఏడు శనివారాలు స్వామివారిని దర్శించుకుని ప్రదక్షిణలు చేయడం ఇక్కడి ప్రత్యేకత కనిపించింది.ప్రకృతి ఒడిలో భక్తులు ఒదిగిపోయేలా ఈ దివ్య క్షేత్రం ఉంటుంది. గోదావరి నదీ తీరాన వెలసిన



ఎర్రచందనుడి వెంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రశాంతమైన వాతావరణాన్ని కలిగి ఉంది. వర్షాలు, ఎండలు వంటి ఇబ్బందులను ఎదుర్కొంటూనే భక్తులు భక్తిశ్రద్ధలతో శనివారం భారీగా తరలి రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. స్వామివారికి జరిగే పూజలు, అభిషేకాలు, తొలి హారతిలో పాల్గొనడం కోసం దూర ప్రాంతాల నుండి భక్తులు తెల్లవారుజామున మూడు గంటలకే తరలివచ్చి హారతి దర్శనంలో పాల్గొన్నారు. ఎక్కడకక్కడ ట్రాఫిక్ జామ్ అవుతున్న అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చేశారు.ఇదే తరహాలోని తమ కోర్కెలు నెరవేరాలని రాజకీయ ప్రముఖ నాయకులు, సినీ యాక్టర్లు, డైరెక్టర్లు నిర్మాతలు, ఏడు శనివారాలు చేస్తున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ డాన్స్ శేఖర్ మాస్టర్ స్వామివారిని దర్శించుకుని ఆయన మొక్కును చెల్లించుకున్నారు.ధర్మకర్తలి మండల సభ్యులు దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. సుమారు లక్ష 20 వేలు పైనే భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆలయంలో ఏడువారాల వెంకన్న గోవిందా గోవిందా అంటూ భక్తులు ఏడు ప్రదక్షిణాలు చేయటం ఒక అద్భుతాన్ని కలిగించింది.

### ఎన్టీఆర్ విగ్రహం పక్కనే చెత్తకుప్పలు..

# స్వచ్ఛతకు తూట్లు..!

**దేవనకొండ జూన్ 13 సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం పరిసరాలు చెత్తకుప్పలకు నిలయంగా మారాయి.ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఈ




ప్రాంతంలో రోజుల తరబడి చెత్త పేరుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.విగ్రహం సమీపంలో పేరుకుపోయిన చెత్త నుంచి దుర్వాసన వెదజల్లు తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటుగా వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చెత్తకుప్పల కారణంగా ఈగలు, దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం పక్కనే అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని వారు విమర్శిస్తున్నారు. వెంటనే స్పందించి చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.విగ్రహాల వద్ద నివాళులు అర్పించే కార్యక్రమాలకే పరిమితమవుతున్న అధికారులు, వాటి పరిసరాల పరిశుభ్రతను మాత్రం విస్మరిస్తున్నారు అని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# వైసీపీ విమర్శలు వాస్తవాలకు దూరం..!

### అభివృద్ధిపై చర్చకు రావాలి..ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటాం

### కుప్పానికి శాశ్వత ఎమ్మెల్యే చంద్రబాబే

**కుప్పం (టౌన్) జూన్ 13 సూర్య న్యూస్:** వైసీపీ నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం రాజకీయ ప్రేరేపితమైనదని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని



తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. కుప్పం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నాయకులు వైసీపీ ఆరోపణలకు ఘాటుగా సమాధానమిచ్చారు. ఈ సమావేశానికి ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు, టీటీడీ పాలక మండలి సభ్యుడు శాంతారామ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ప్రేమ్‌కుమార్, విశ్వనాథ్, చెక్కునత్తం మణి, బాబునాయుడు, తిరుమగళ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రజల మన్ననలు పొందుతున్న తరుణంలో వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అభివృద్ధి అంశాలపై చిత్తశుద్ధితో చర్చకు రావాల్సిందిపోయి అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం ప్రాంతానికి నీరు అందించడం కూటమి ప్రభుత్వ కృషి ఫలితమని, దీనిపై కూడా వైసీపీ నాయకులు రాజకీయ విమర్శలు చేయడం విచారకరమన్నారు. "మేమేమైనా ట్యాంకర్ల ద్వారా నీటిని తోలామా?" అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో టీడీపీ చేపట్టిన కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించిన నాయకులు, ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు, ఆ పార్టీ అధినేతకు లేదని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా పాలన సాగించిన వారు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసే నైతిక హక్కు కోల్పోయారని విమర్శించారు. ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధమని టిడిపి నాయకులు సవాల్ విసిరారు. ఆరోపణలు చేసే నాయకులు వాటిని ఆధారాలతో రుజువు చేయాలని, లేకపోతే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత దూషణలు, రాజకీయ ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, కుప్పం అభివృద్ధికి చంద్రబాబు నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కుప్పంకు శాశ్వత శాసనసభ్యుడు చంద్రబాబేనని, ఆయన ప్రాణం ఉన్నంతకాలం ప్రజల హృదయాల్లో స్థానం నిలిచే నాయకుడని పేర్కొన్నారు. చంద్రబాబును రాజకీయంగా ఓడించే నాయకుడు ఇప్పటివరకు లేదని, ఇకపై కూడా రాదని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కూటమి ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగుతోందని, ప్రజలు కూడా ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, రాజకీయ విమర్శల కంటే అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి సారించాలని వైసీపీ నాయకులకు సూచించారు.

### ప్రపంచ రక్తదాతల దినోత్సవం వేడుకల్లో రజిని ట్రస్టు

# రక్త బంధంట్రస్టు ఎంపిక చేసిన రెడ్ క్రాస్ సొసైటీ

**ధర్మవరం జూన్ 13 సూర్య న్యూస్:** పట్టణానికి చెందిన రక్త బంధం ట్రస్టు రజిని ట్రస్టు సభ్యులకు సమాజ సేవ కోసం ఉమ్మడి జిల్లాలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ చేసినందుకు





అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఇన్చార్జ్ జిల్లా కలెక్టర్ ఆనంద్ వారి పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమం జూన్ 14వ తేదీన అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నందు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రకటన విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రజిని ట్రస్ట్, రక్త బంధం ట్రస్టు వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్ మాట్లాడుతూ 2025 సంవత్సరం నుంచి 2026 సంవత్సరం వరకు జిల్లాలో వివిధ బ్లడ్ బ్యాంకులకు ఆరు మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది దాదాపు 300 యూనిట్లు రక్తాన్ని సేకరించి వివిధ బ్లడ్ బ్యాంకులకు అందించడం జరిగిందని ముఖ్యంగా డయాలసిస్ బాధితులకు మరియు తలసేమియా చిన్నారుల కోసం ఈ యొక్క రక్తం చేయడం జరిగిందని నిస్వార్థ సేవలు గుర్తించి రజనీ ట్రస్టు రక్త బంధం ట్రస్టు సభ్యులు చిప్పల చంద్రశేఖర్, శ్రీ వాసవి రక్తనిధి ఆర్యవైశ్య యువజన సమస్త అనుబంధ సమస్త కొత్తూరు జూటూరు మహేష్ బాబు,వారికి ఈ కార్యక్రమానికి చేసినందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ వారికి ధన్యవాదములు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# వైకుంఠ మహాప్రస్థానం రామచంద్రపురం

**జంగారెడ్డిగూడెం జూన్ 13 సూర్య న్యూస్ :** పట్నంలోని రామచంద్రపురం గ్రామంలో ఈశాన్యం వైపు గల పాతనాటి కుంట అనుకుని గత డబ్బై సంవత్సరాల క్రితం నుండి గొల్లగూడెం గా ఉండే గ్రామమును రామాలయం కట్టి రామచంద్రపురం గా నామకరణం చేసిన గ్రామ వాసి పరిమి గంగరాజు జంగారెడ్డిగూడెం సర్పంచ్ గా చేసిన సమయములో హిందూ శ్మశాన వాటికగా కార్యక్రమములు జరిగేవి జంగారెడ్డిగూడెం ఊరుకి కొయ్యలగూడెం రోడ్డులో రామయ్య కుంట దగ్గర అలానే పాతనాటి కుంట రామచంద్రపురం లో ఎందరో పెద్దలను ప్రస్తుతము ఉన్న పెద్దల స్వర్గస్తులయిన కుటుంబీకులను హైస్కూల్ దగ్గర నుండి రాజుల కాలనీ అందరు ఇక్కడే చేసేవారు కాలక్రమేణా పాతనాటి కుంట పక్కన పశువుల ఆసుపత్రి రోడ్ సరిగ్గా లేక అందరు రామయ్య కుంట దగ్గరకు వెళ్లగా అయిదు ఎకరాలున్న కుంట నిత్యం నీళ్లు చాకళ్లు పశువులు కి గొర్రెలు మేకలకు నీళ్లు చేపలు ఉండేవి చెరువు కబ్జా చేసి స్థలాలు వేసి అమ్ముకుని విడతల విడతగా కాయితాలు బై నెంబర్ లతో పుట్టించి





అన్యాక్రాంతమతుంటే రామచంద్రపురం గ్రామ వాసులు సమిష్టిగా యాదవులు కమ్మవారందరు పురాతన దేవాలయం అభివృద్ధిచేసి ఇప్పుడు గ్రామం ఒక సంక్షేమ సంఘం గా అన్ని కులాల వారిని సభ్యులుగా చేసుకుని అందరూ చందాలు వేసుకుని వైకుంఠ మహాప్రస్థానం అభివృద్ధికి కంకణం కట్టి పెద్దల సహకారంతో గతంలో నంబూరి రామచంద్రరాజు వార్డ్ మెంబర్ గా ఉన్నప్పుడు వేయించిన కొట్టుడు పంపు తీసి మోటార్ పెట్టి సంవత్సర క్రితం శుభ్రం చేసి కొంత స్థలం చుట్టూ బీమ్ వేసి రెండు మూడు కార్యక్రమాలు చేసారు ఇప్పుడు ఉత్తరము సిమెంట్ రోడ్ అలానే కొన్ని ఇళ్ళు వచ్చినందున ముందు ప్రహరీ గోడ కట్టుటకు ముఖ్య అతిధిగా అల్లూరి రామకృష్ణని ఆహ్వానించి గ్రామ వాసులు పట్టణ టీడీపీ అధ్యక్షులు కొండ్రెడ్డి కృష్ణ కిషోర్ టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ గ్రామములోని పెద్దలు అందరు పూజ నిర్వహించి పనులు మొదలు పెట్టారు తమ గ్రామ పురాతన రామాలయం అభివృద్ధి చేసినట్లుగా ఊరు పెరిగి నందుగా ఎప్పటి నుండో ఉన్న స్మశానం అభివృద్ధి చేయాలి కావున దాతలు విరాళాలు ఇవ్వగలరని అధికారులు అధికార పరంగా తగు ప్రోత్సహం అలానే సహకారం చేసి ఆ ప్రాంగణం అభివృద్ధి అలానే కార్యక్రమములకు తగు సహాయ సహకారాలు అందించాలి కోరుచున్నారు.

# కాంగ్రెస్ పార్టీ బి.ఎల్.ఏ. - 1ల నియామకం

### జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అధిష్టానం లేఖలు అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పార్వతీపురం జూన్ 13 సూర్య న్యూస్ :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిబి ఎల్ ఏ-1 ల నియామకం




చేపట్టినట్లు డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు తెలిపారు.ఈ మేరకు శనివారం అధిష్టానం నుండి వచ్చిన నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత ఎన్నికల విభాగపు అధికారి ఎస్. కిషోర్ కుమార్ కు అందజేశారు.ఈ సందర్భంగా డిసిసి వంగల దాలినాయుడుమాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, సాలూరు,పాలకొండ , కురుపాం నియోజకవర్గాలకు సంబంధించిన బి ఎల్ ఏ-1 లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి నియమించారన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున బిఎల్ఏ - 1లను నియమించినట్లు తెలిపారు.దానికి సంబంధించి నియామక పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. జిల్లాలో జరగనున్న కు సంబంధించి రానున్న స్థానిక ఎన్నికలకు సంబంధించి బి ఎల్ ఏ -2 ల నియామకానికి అవసరమైన బాధ్యతలను బిఎల్ఏ -1 నిర్వర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, పార్వతీపురం మండల అధ్యక్షులు బంకురు ప్రకాష్, ఏవో గంట మోహన్ రావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సవర వసుంధర తదితరులు పాల్గొన్నారు.

### కూటమి వెన్నుపోటుకు రెండేళ్లు.. ప్రజలను

# మోసం చేశారు: మాజీ మంత్రి కాకాణి

**పొదలకూరు జూన్ 13 సూర్య న్యూస్:** ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి



కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. కూటమి వెన్నుపోటు రాజకీయాలకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. "చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారు" అని ఆయన అన్నారు.సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు తాను సిద్ధమని కాకాణి స్పష్టం చేశారు. "నీ చెంచాలను పంపించడం కాదు, నువ్వే నేరుగా చర్చకు రా" అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక ఉత్సవాలకు

# విస్తృత ఏర్పాట్లు

### శాఖంభరీ ఉత్సవాలు, ఆషాఢ సారెపై ఈవో కీలక ఆదేశాలు

### భక్తుల సౌకర్యాలే లక్ష్యం.. ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

**విజయవాడ జూన్ 13 సూర్య న్యూస్:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో రాబోయే ఆధ్యాత్మిక, ధార్మిక ఉత్సవాల నిర్వహణపై ఆలయ ఈవో వీకే శీనా నాయక్ శనివారం అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఉత్సవాల విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పా ట్లు, భక్తులకు అందించాల్సిన సౌకర్యాలపై ఆయన పలు కీలక సూచనలు చేశారు.జూన్ 17న నిర్వహించనున్న ఉచిత సామూహిక అక్షరాభ్యాస మహోత్సవానికి సంబంధించి భక్తుల రిజిస్ట్రేషన్, పూజా సామగ్రి పంపిణీ, మహామండపంలో వసతుల ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమానికి వచ్చే కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద జరుగుతున్న కృష్ణానదీ పుణ్య హారతులకు రోజురోజుకు భక్తుల ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలోఅక్కడ శాశ్వత మౌలిక వసతులు, ఘాట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. జులై 15 నుంచి ఆగస్టు 12 వరకు నెలరోజుల పాటు జరిగే ఆషాఢ సారె సమర్పణ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా వచ్చే మహిళా భక్తులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూ లైన్లు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే జులై 27, 28, 29 తేదీల్లో నిర్వహించే శాఖంభరీ ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.దేవస్థాన సంప్రదాయాలు, నిబంధనలకు అనుగుణంగా వైదిక, పరిపాలనా విభాగాలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈవో స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, శంకర శాండిల్య, డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కోటేశ్వరరావు, రమాదేవి, ఏఈవోలు చంద్రశేఖర్, సుధారాణి, ఎన్. రమేష్ బాబు, కె. గంగాధర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఘనంగా ముగిసిన భాగవత సప్తాహం

#### ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి

**వేంపల్లె జూన్ 13 సూర్య న్యూస్:** స్థానిక పట్టణంలోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేది నుండి నిర్వహించిన భాగవత సప్తాహం శనివారంతో ఘనంగా ముగిసిందని పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి తెలిపారు.7వ తేది నుండి 13వ తేదీ వరకు భాగవత సప్తాహం, భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆలయ వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్ర




పుష్పం, కలశ పూజ అనంతరం కలశ ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం భాగవత భక్త సమాజం సభ్యులను రవికుమార్ రెడ్డి, కుమారుడు ప్రీతం కుమార్ రెడ్డి, కోడలు వైష్ణవి ఘనంగా సన్మానించారు. 7 రోజుల పాటు భక్తులకు ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, ఆలయ వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గోపిరెడ్డికి ఎమ్మెల్యే చదలవాడ ఛాలెంజ్..!

### వైసిపి ఐదేళ్లలో చేయలేని అభివృద్ధి కూటమి పాలన రెండేళ్లలో చేసి చూపించాం

### కూటమి పాలన చూసి సిగ్గుతో తలవంచుకోండి...కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట జూన్13 సూర్య న్యూస్ :** అభివృద్ధి అంటే కూటమి ప్రభుత్వానికే చెందుతుందని, గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగించిందని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు విమర్శించారు.వైసిపి ఐదేండ్లలో చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసి చూపించిందని,దానికి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు.శనివారం స్థానిక లింగంగుంట్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈనెల 15వ తేదీ సోమవారం ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న విజయోత్సవ సభకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపిజిల్లా అధ్యక్షులు శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



చదలవాడ మాట్లాడుతూ ఉమ్మడి కూటమి రెండేళ్ల పాలన చూసి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈర్ష్య పడుతున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లలో వారు చేయలేని అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చేసి చూపించిందని, దీనికి సిగ్గుతో తలవంచుకోవాలని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి పగటి కలలు కంటున్నారని, 2029 ఎన్నికల్లో కూడా నరసరావుపేట నియోజకవర్గంలో తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని, రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ఐదోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జాన్ సైదా మాట్లాడుతూ ఉమ్మడి కూటమి విజయోత్సవ సభను జయప్రదం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

# ఖబర్దార్ వైసిపి నాయకులారా ఖబర్దార్..!

**టిడిపి సీనియర్ నాయకుడు దేశాధి ప్రకాష్**

**కూటమి ప్రభుత్వం అభివృద్ధిని ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు**

**పుంగనూరు జూన్ 13 సూర్య న్యూస్ :** కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల పరిపాలన లో ప్రజల అభివృద్ధిని తెలియజేస్తూ తిరుపతిలో మహాసభ ఏర్పాటు చేయడం



జరిగింది. ఈ సభను విజయవంతం కానీయకుండా కుట్రపన్నే పన్నాగంలో భాగంగా పులివెందుల ఎమ్మెల్యే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పుంగనూరులో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు విజువల్స్, డాన్సులు చేస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా ర్యాలీని నిర్వహించి నోటికి వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడడం జరిగిందని, అయితే మేము వైసిపి లీడర్లకు ఖబర్దార్ తెలుపుతున్నామని, మీరు కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే ముందు ఒకసారి మీరు గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి లో భాగంగా మీ చుట్టూ కానీ మీ ఇంట్లో ఉన్న మహిళలు ప్రభుత్వ పథకాలు పొందుతున్న అభివృద్ధిని గమనించాలని తల్లికి వందనం, మెగా డీఎస్సీ, దీపం పథకం, పింఛన్ల పెంపు ఇలా మొదలుకొని పథకాలు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని వైసీపీ నాయకులకు మరోసారి గుర్తు చేస్తున్నామని అన్నారు. రానున్న 15 సంవత్సరాలు కూడా కూటమి ప్రభుత్వమే పరిపాలన కొనసాగేది ఖాయమని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరిక ఉంటే మేము వారిని సాధారణంగా మా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. పుంగనూరులో అభివృద్ధి విషయానికొస్తే గత ఐదు సంవత్సరాలుగా తమ స్వార్థానికి మినీ బైపాస్ రోడ్డు, ఇతరత్రా అభివృద్ధి పనులలో ఎంత దోచుకున్నారో దాచుకున్నారు అన్నది ప్రజలందరికీ తెలుసునన్నారు. హంద్రీ నీవా జలాలు పుంగనూరు తెప్పించి నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించిన కూటమి ప్రభుత్వాన్ని మాట్లాడటం సరికాదన్నారు. పుంగనూరు చుట్టుపక్కల నిలిచిపోయిన రోడ్లను తిరిగి వేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వంది కాదా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలు మీరు అభివృద్ధి చేసి ఉంటే ప్రజలు మీకు కేవలం 11 మంది ఎమ్మెల్యేల మెజారిటీ ఎందుకు ఇస్తారని ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, కార్యకర్తల పై అక్రమ కేసులు బనాయించి వందల మంది ని జైలుకు పంపిన ఘనత మీది కాదా అని, కరోనా సమయంలో ఇక్కడ ఎమ్మెల్యే ఎంపీ ఎక్కడికి వెళ్లిపోయారని కరోనా సమయంలో ప్రజలు భయాందోళనలో ఉంటే ప్రజలకు ఆరోగ్య రక్షణ లో భాగంగా ఎప్పుడైనా తిరిగారని, కరోనా సమయంలో రిజిస్టర్ ని దొంగగా ఇంటికి పిలిపించుకొని సంతకాలు పెట్టినంత సులభంగా ప్రజలను మన్ననలు పొందడం సాధ్యం కాదన్నారు. అవసరమైతే సెంట్రల్ వరకు ఈ విషయాన్ని తీసుకువెళ్లి అప్పటి అధికారులను సైతం వదిలేది లేదన్నారు. మీకు ఈ రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఓర్వలేకే ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. మీడియా సమావేశంలో పుంగనూరు పట్టణ టిడిపి సీనియర్ నాయకులు దేశాధి ప్రకాష్ సివిరెడ్డి మైనార్టీ నాయకులు సయ్యద్ సుహేల్ భాష, తోట గిరిధర్, లక్ష్మణరాజు, షామీర్, రామయ్య, ఇబ్రహీం, రమేష్, చంద్ర, బిజెపి సీనియర్ నాయకులు మఠం బాబు, చంద్రశేఖర్ రాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 975,673 జీవోలను ఉపసంహరించుకోవాలి

**వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు**

**విజయవాడ జూన్ 13 సూర్య న్యూస్ :** మున్సిపల్ రంగంలో 14 కీలక విభాగాలను, పౌర సేవలను పి పి పి పద్ధతిలో ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన



975,673 జీవోలను తక్షణమే ఉపసంహరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దొనేపూడి కాశీనాథ్ నగర ప్రధాన కార్యదర్శి ఎస్ జ్యోతి బసు, వెహికల్ డిపో ప్రధాన కార్యదర్శి జలసూత్రం నాగరాజు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కు లేఖ రాశారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికులకు నష్టదాయకమైన 14 కీలక విభాగాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ కార్మికులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కు ఎన్డీఏ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ విధులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల దశాబ్దాల తరబడి ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి కృషి చేసిన కార్మికులకుతీవ్రనష్టంచేకూరుతుందన్నారు. ఇటువంటి చర్యల వలన కార్మికుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి పెరగడానికి దారితీస్తుందని ప్రైవేటీకరణ విషయంలో పునరాలోచించాలని తమ వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి కు విజ్ఞప్తి చేశారు. విజయవాడ ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అద్దంకి వెంకటరమణ, వీ సాంబశివరావు, పీ శ్రీను మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో ఎమ్మెల్యే ముప్పిడి పాల్గొనడం

**చెత్తరహిత కొవ్వూరే లక్ష్యం.. ప్రజలకు ఎమ్మెల్యే పిలుపు**

**పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి డ్రైనేజీలు శుభ్రం చేసిన ఎమ్మెల్యే**

**కొవ్వూరు జూన్ 13 సూర్య న్యూస్ :** పట్టణాన్ని చెత్తరహిత, పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఎమ్మెల్యే ముప్పిడి



వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శని వారం నిర్వహించిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని 5వ, 6వ వార్డులను సందర్శించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను స్వయంగా తొలగించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణాభివృద్ధితో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ కొవ్వూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శ్రీస్వామి అమ్మవార్లకు కోటి రూపాయల బంగారు, వెండి కానుకలు

**లలితా ఎంటర్‌ప్రైజెస్ ఎండీ దంపతులు ఈఓ ఎం. శ్రీనివాసరావుకు అందజేత**

**శ్రీశైలం(దేవస్థానం) జూన్ 13 సూర్య న్యూస్:** కాకినాడ జిల్లా, పెద్దాపురానికి చెందిన లలితా ఎంటర్‌ప్రైజెస్ ఇండస్ట్రీస్



ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు శ్రీస్వామిఅమ్మవార్లకు పలు వెండి వస్తువులను, బంగారు ఆభరణాలను సమర్పించారు. బంగారు నామాలు, చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజా వస్తువులు, బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను వీరు సమర్పించారు. సమర్పించిన మొత్తం వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు కాగా, బంగారు ఆభరణాల బరువు 73.500 గ్రాములు. వీటి విలువ సుమారు కోటి



రూపాయలని దాతలు తెలిపారు. ఈ బంగారు ఆభరణాలు, వెండివస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మట్టే శ్రీనివాస్ కుటుంబ సభ్యులైన రోహన్, రాకేష్ (సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ డైరెక్టర్), ఆదిత్యకృష్ణ తదితరులు కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావుకి అందజేశారు. కార్యక్రమంలో స్వామివారి ప్రధానార్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు విజయకుమార్ స్వామి, సహాయ కార్యనిర్వహణా




ధికారి జి. స్వాములు, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజిరవి, ధర్మప్రచార పర్యవేక్షకులు నాగేశ్వరరావు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ముఖ్యభద్రతా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం దాతలకు తగు రశీదు అందజేసి, వేదాశీర్వచనంతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## మందపల్లి మందేశ్వర ఆలయానికి

# భారీగా భక్తులు

**సుమారు 50 వేల పైగానే భక్తులు మందేశ్వర స్వామి దర్శనం**

**ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించామన్న ఈవో సురేష్ బాబు**








**కోనసీమ/కొత్తపేట జూన్ 13 సూర్య న్యూస్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం మందపల్లిలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి ఆలయానికి శనివారం ఊహించని తరహాలో భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా శనివారం రోజున స్వామివారికి తైలాభిషేకాలు చేసేందుకు ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. తైలాభిషేకాలు నిర్వహించి శని మహాదశ, ఏలినాటి శని, అష్టమ శని దోషాలు ఉన్నవారు అధిక సంఖ్యలో పాల్గొని శనీశ్వరునికి నువ్వుల నూనెతో తైలాభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉమా మందేశ్వరునికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్ల వస్త్రాలు, నువ్వులు సమర్పించుకున్నారు. సాధారణ శనివారాలతో పాటు అమావాస్య , శని త్రయోసి కలిసి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ఆలయ ఈవో దారపు రెడ్డి సురేష్ బాబు సిబ్బంది. పోలీసువారి సహకారంతో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించామన్నారు. చంటి పిల్లలకు వృద్ధులకు వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి పాలు బిస్కెట్లు మంచినీళ్లు మజ్జిగ అందజేశామన్నారు. సుమారు 40 వేల నుండి 50 వేల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నామని ఈవో తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్ల

# నిర్మాణాలు పూర్తి చేయండి

**-జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**నరసరావు పేట జూన్13 సూర్య న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన మొత్తం 484 అదనపు తరగతి గదులు, 55 టాయిలెట్ల నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా



కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో 218 అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి కావలసి ఉందన్నారు. ఇప్పటికే పూర్తయిన తరగతి గదులకు విద్యాశాఖ వద్ద అదనంగా ఉన్న ఫర్నీచర్ ను ప్రాధాన్యతా క్రమంలో పంపిణీ చేయాలన్నారు. వీటికి తోడు 23 టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఏయే పాఠశాలలో నిర్మాణాలు ఏయే తేదీలోగా పూర్తి చేస్తారో టైమ్ లైన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పూర్తయిన తరగతి గదులకు ఎప్పటికపుడు ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, పంచాయతీ రాజ్, పబ్లిక్ హెల్త్ మున్సిపల్, గ్రామీణ నీటి సరఫరా, సమగ్ర శిక్ష, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై టీడీపీ ఆధ్వర్యంలో

# అవగాహన సదస్సు

**తాడిపత్రి /పుట్లూరుజూన్ 13 సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కన్వీనర్ గుత్తా శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగా హన సదస్సు నిర్వహిం చారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ



కార్యక్రమంలో ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు పాత ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా బూత్ స్థాయి అధికారులు, బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని గుత్తా శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, డబుల్ ఎంట్రీ ఓట్లు, మృతుల పేర్లను గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ట్రైనర్ దేగల కృష్ణమూర్తి, పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ నాగభూషణ, గుత్తా భాస్కర నాయుడు. ఎల్కే చెన్నారెడ్డి. సత్యం రెడ్డి. నాగేశ్ రెడ్డి. జి విజయ్ నాయుడు. చల్ల చంద్ర. గంగార్జున నాయుడు. మండల బీఎల్ఏలు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మురారిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు

# అవగాహన కార్యక్రమం

**గండేపల్లి జూన్ 13 సూర్య న్యూస్:** మండలం లోని మురారి గ్రామంలో శనివారం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పతంజలి సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ.ఎస్. ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, రైతులకు కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, ఆధునిక సాగు పద్ధతులు, విజయవంతమైన రైతుల అనుభవాల గురించి వివరించారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తే అధిక దిగుబడితో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యం (డ్రిప్






ఇరిగేషన్)పై లభిస్తున్న రాయితీలను రైతులకు వివరించారు. డ్రిప్ విధానంలో ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి ఆదా, పంట ఉత్పాదకత పెరుగుదలతో పాటు అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను కూడా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాస్తి వసంత్ కుమార్, ఎన్. త్రిమూర్తులు, వి. బుల్లిరాజు, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్. వీర్రాజు, ఫీల్డ్ ఆఫీసర్ టీవీఎస్. మనీంద్ర, పామ్ ఆయిల్ కంపెనీ సిబ్బంది వి. నరేష్, వి. బాలాజీ, కేవీవీ ప్రసన్న, బి. దుర్గాప్రసాద్, కె. మనోజ్, కె. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అధిక సంఖ్యలో ఆయిల్ పామ్ రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెండేళ్ల పాలనకు విజయోత్సవ వేడుకలు

**చింతలపూడిలో భారీ సభకు కూటమి సన్నాహాలు**

**చింతలపూడి జూన్ 13 సూర్య న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చింతలపూడి నియోజక వర్గంలో విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరమ య్యాయి. ఈనెల 15,వ తేదీన చింతలపూడి మార్కెట్ యార్డ్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. సభ నిర్వహణపై కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న విజయో త్సవ సభకు భారీగా జనసమీకరణ చేపట్టాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన క్యాంపు కార్యాల యంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ ల నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి నాయకులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే



కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పలు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ఫలితాలు రానున్న రోజుల్లో మరింత స్పష్టంగా ప్రజలకు కనిపిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందుకే రెండేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహి స్తున్న విజయోత్సవ సభను చారిత్రాత్మకంగా విజయ వంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈనెల 15,వ తేదీ ఉదయం చింతలపూడి మార్కెట్ యార్డ్‌లో జరిగే సభకు ప్రతి గ్రామం నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సభ విజయ వంతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచే యాలని, నియోజకవర్గ స్థాయిలో భారీ స్పందన కనిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావే శంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతి నిధులు, మండల, పట్టణ స్థాయి కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

సూర్య

ఆదివారం 14 జూన్, 2026

## రైతాంగ సమస్యల పరిష్కారానికి
# రాష్ట్ర మహాసభలు కీలకం

**జూలై 3న 'హలో రైతన్న - ఛలో ఏలూరు' ప్రదర్శన బహిరంగ సభ**

**రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు**

**చింతలపూడి జూన్ 13 సూర్య న్యూస్:** జూలై 3, 4, 5 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం



చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ రైతులకు పిలుపునిచ్చారు. అలాగే జూలై 3న 'హలో రైతన్న – ఛలో ఏలూరు' పేరుతో నిర్వహించే రైతాంగ ప్రదర్శన, బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా శనివారం చింతలపూడి మండలం అంకులయ్య కొత్తగూడెం గ్రామంలో రైతు సంఘం నాయకుడు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన రైతుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. మూడేళ్లకోసారి జరిగే రాష్ట్ర మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి, తీర్మానాలు ఆమోదించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు పెరిగినా, రైతుల పంటలకు తగిన మద్దతు ధరలు పెంచలేదని విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు సరైన కొనుగోలు వ్యవస్థ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, కోకో వంటి పంటల సాగుదారులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి, రైతు పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్.వి.ఎస్. నారాయణ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని, రైతులకు ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంటలు పండించకపోతే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిహెచ్. సర్వేశ్వరరావు, మద్దు రత్తయ్య, మోరంపూడి సీతారామయ్య, చీకటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి ఆయిద్య కు కన్నీటి నివాళులు

**శోకసంద్రంలో విక్రాంపురం గ్రామం**

**పార్వతీపురం మన్యం జూన్ 13 సూర్య న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం,పాల్వంచ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి బల్లా. ఆయిద్య (4) మృతి చెందిన





విషయం తెలిసిందే. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వీరి కుటుంబం ఇటీవలే 10 వ తేదీన తల్లి,అమ్మమ్మ,తాతయ్య తో కలిసి కారులో భద్రాచలం దర్శనానికి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలోఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నారి ఆయిద్య అక్కడికక్కడే మృతి చెందింది. అమ్మమ్మ ,తాతయ్యలు తీవ్ర గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న తండ్రి అమెరికా నుంచి బయలుదేరి సొంత గ్రామానికి చేరుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం చిన్నారి ఆయిద్య పార్థివ దేహం కు అంత్యక్రియలును తమ సొంత గ్రామమైన కొమరాడ మండలంలోని విక్రంపురం గ్రామంలో నిర్వహించారు. ఈ క్రమంలో తల్లి దండ్రులు, కుటుంబసభ్యులు ఎంత దారుణం జరిగిందంటూ గుండెలు పగిలేలా విలపించారు. గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయి చిన్నారి పార్థివ దేహం కు కన్నీటి నివాళులు అర్పించారు.

## ఊక లారీల దందాపై పోలీసుల ఉక్కుపాదం..
# పగటిపూట రోడ్డెక్కితే సీజ్

**ప్రజల ఫిర్యాదులకు స్పందించిన ఎస్సై రామకృష్ణ.. ఊక లారీలకు కఠిన హెచ్చరిక**

**ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకు ఊక లారీలకు నో ఎంట్రీ.. తాళ్లపూడి పోలీసుల నిర్ణయం**


**తాళ్లపూడి జూన్ 13 సూర్య న్యూస్:** మండలంలో ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా సంచరిస్తున్న ఊక లారీల వ్యవహారంపై స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తీవ్రంగా



స్పందించారు. ప్రజలకు, వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఊక లారీలపై ఇటీవల పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురిత మవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పగటిపూట మెయిన్ రోడ్డులో ఊక లారీలు తిరగడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు రహదారులపై ఊక చెదరిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రధాన రహదారులపై ఊక లారీలు కనిపిస్తే వెంటనే సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించే లారీ యజమానులు, డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేసిన ఆయన, రాత్రి 9 గంటల తర్వాత మాత్రమే ఊక లారీల రాకపోకలకు అనుమతి ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్సై టి. రామకృష్ణ వెల్లడించారు.

# వన్నప్ప మృతికి టీడీపీ నేతల నివాళి

**గోరంట్ల జూన్ 13 సూర్య న్యూస్:** పట్టణానికి చెందిన రిటైర్డ్ పశుసంవర్ధక శాఖ ఉద్యోగి, ఎరుకల సంక్షేమ సంఘం గోరంట్ల మండల గౌరవ అధ్యక్షుడు వన్నప్ప అనారోగ్యంతో



శనివారం కన్నుమూశారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, నాగే నాయక్, ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దేవరకొండ ఉమాశంకర్, మాజీ వార్డు సభ్యులు నాగరాజు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. వన్నప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# స్వచ్ఛత వైపు సమిష్టి అడుగులు

**నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి**

**ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో ప్రతి వార్డులో పరిశుభ్రత ముద్ర**







**కర్నూలు జూన్ 13సూర్య న్యూస్ :** నగరాన్ని పరిశుభ్రంగాసుందరంగాతీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' నాలుగో వారపు కార్యక్రమాలను శనివారం నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఓల్డ్ కల్లూరు కురువ వీధిలో ప్రజా మరుగుదొడ్ల శుభ్రత, ముజఫర్ నగర్‌లో గార్బేజ్ పాయింట్‌ను నర్సరీగా అభివృద్ధి చేసిన ప్రాంతంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, చెత్తను రహదారులపై వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన నగరాన్ని నిర్మించగలమన్నారు. గత నాలుగు వారాలుగా వివిధ అంశాలపై ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి ప్రతి వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ముద్ర వేయడం జరిగిందన్నారు. నగర పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రహదారులు, జంక్షన్లు, రెడ్–యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, కుర్మయ్య, ఎంజల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.


## పట్టణంలో వరుస దొంగతనాలు..
# పోలీసు నిఘా ఎక్కడ..?

**నిద్రపోతున్న పోలీసు యంత్రాంగమా..ప్రజల భద్రతకు భరోసా ఏది..?**

**ఆరు నెలలుగా వరుస నేరాలు.. పట్టణ ప్రజల్లో భయాందోళన**

**దొంగతనాలు, గంజాయి ఘటనలపై పోలీసుల మౌనం ఎందుకు..?**

**గుంతకల్లు జూన్ 13 సూర్య న్యూస్ :** పట్టణంలో వరుసగా చోటుచేసుకుంటున్న దొంగతనాల ఘటనలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. పట్టపగలు,




రాత్రి అనే తేడా లేకుండా చోరీలు జరుగు తుండటం తో పట్టణ ప్రజలు పోలీసు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొన్న ఆదర్శ నగర్‌లో చోరీ ఘటన చోటు చేసుకోగా.. నిన్న ఆలూరు రోడ్డులో ఈరోజు భాగ్యనగర్ ప్రాంతంలో దొంగలు తమ చేతివాటం చూపడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. వరుసగా మూడు రోజుల వ్యవధిలో మూడు ప్రాంతాల్లో దొంగతనాలు జరగడం గుంతకల్లు పట్టణంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తిస్తోంది. గత కొంతకాలంగా పట్టణంలో నేర ఘటనలు పెరుగుతున్నా, వాటిని అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో గంజాయి వ్యవహారాలు, దొంగతనాలు వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నప్పటికీ.. నేర నియంత్రణపై పోలీసులు ప్రజలకు స్పష్టమైన భరోసా కల్పించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ఆదర్శనగర్, కొనకొండ్ల గేట్ తదితర ప్రాంతాల్లో దొంగతనాల బెడద ఎక్కువైందని ప్రజలు చెబుతున్నారు. ఇంట్లో దొంగతనం జరిగిన వెంటనే 100కు ఫోన్ చేస్తే పోలీసులు వచ్చి వివరాలు నమోదు చేసుకుని వెళ్తున్నారని, కానీ ఆ తర్వాత కేసు పురోగతి, నిందితుల వివరాలు, తీసుకున్న చర్యలపై ఎలాంటి సమాచారం ఉండటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహణపై కూడా ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటి ఆధారంగా నిందితులను పట్టుకోవడంలో వేగం కనిపించడం లేదని అంటున్నారు. నేరస్థులకు పోలీసుల భయం లేకుండా పోయిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే గుంతకల్లు పట్టణంలో ఇప్పుడు వరుస చోరీలతో ప్రజలు తలుపులు వేసుకుని భయంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో గస్తీని పెంచడంతో పాటు పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేయాలని కోరుతున్నారు. గుంతకల్లు పట్టణంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రస్తుతం ప్రజల్లోనే కాదు.. రాజకీయ, సామాజిక వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి. ప్రజల భద్రతపై పోలీసు శాఖ స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాలేనా..?

**శ్రీసిటీ--మాంబట్టు పరిశ్రమల్లో రవాణా భద్రతపై ఆందోళన**

**బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం.. ప్రమాదాల బాటలో పారిశ్రామిక కార్మికుల ప్రయాణం**

**ప్రమాదం జరిగితేనే స్పందన.. కంపెనీలు, అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు**

**సూళ్లూరుపేట జూన్ 13 సూర్య న్యూస్:** జిల్లాలోని శ్రీసిటీ, మాంబట్టు సెజ్ పారిశ్రామిక ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులను రోజూ తరలించే ప్రైవేట్ కంపెనీ బస్సుల భద్రతపై





తీవ్ర ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. పరిశ్రమల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల మధ్య కార్మికుల ప్రాణ భద్రత నిర్లక్ష్యానికి గురవుతోందని కార్మిక సంఘాలు, స్థానికులు విమర్శిస్తున్నారు. శనివారం శ్రీసిటీ జీరో పాయింట్ సమీపంలో ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ కంపెనీకి చెందిన సిబ్బంది బస్సులో ఇంజిన్ భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులను వెంటనే కిందికి దించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనతో పారిశ్రామిక ప్రాంతాల్లో నడుస్తున్న బస్సుల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ఇటీవల కూడా శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత నెల తడ సమీపంలో టీవీఎస్ కంపెనీ ఉద్యోగులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని బోల్తా పడగా పలువురు గాయపడ్డారు. జూన్ తొలి వారంలో అపాచీ కంపెనీ కార్మికులను తీసుకెళ్తున్న బస్సు ప్రమాదానికి గురై డ్రైవర్ మృతి చెందిన ఘటన కూడా ఆందోళన కలిగించింది. కార్మికుల రవాణాకు వినియోగిస్తున్న కొన్ని బస్సులు సరైన నిర్వహణ లేకుండా నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, సాంకేతిక తనిఖీలు, భద్రతా ప్రమాణాల అమలుపై సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదని విమర్శలు ఉన్నాయి. అలాగే డ్రైవర్లపై అధిక పని ఒత్తిడి, అనుభవం లేని సిబ్బందిని నియమించడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. పరిశ్రమల చట్టాల ప్రకారం కార్మికుల భద్రతను యాజమాన్యాలు నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సంస్థలు ఆ బాధ్యతను విస్మరిస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే చర్యలు చేపట్టడం కాకుండా, ముందస్తు తనిఖీలు, కఠిన పర్యవేక్షణ, నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పొట్టకూటి కోసం పరిశ్రమలకు వచ్చే కార్మికుల ప్రాణాలు సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం, రవాణా శాఖ, పరిశ్రమల యాజమాన్యాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పోలవరం ముంపు ముప్పులో గండి పోశమ్మ ఆలయం

**పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీ పురందరేశ్వరికి బీజేపీ నేతల వినతి**

**భక్తుల మనోభావాలను గౌరవించి రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్**

**రంపచోడవరం జూన్ 13 సూర్య న్యూస్:** శతాబ్దాల చరిత్ర కలిగిన గిరిజనుల ఆరాధ్య దైవం గండి పోశమ్మ ఆలయ పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరిని కోరారు. ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఆలయం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయం నీట మునగకుండా పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించి పుణ్యక్షేత్రాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజానగరం--పురుషోత్తపట్నం రహదారి నిర్మాణాన్ని కూడా త్వరితగతిన చేపట్టాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఏపీఆర్



చౌదరి, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు మాట్లాడుతూ గండి పోశమ్మ ఆలయం గిరిజన ప్రాంత ప్రజలకే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రమని తెలిపారు. ఆలయాన్ని పరిరక్షించడంతో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఆలయ రక్షణ కోసం స్థానిక ప్రజలు అవసరమైతే ఆందోళన కార్యక్రమాలకు కూడా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పోలవరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు వీకా బుల్లికొండలు దొర, కోన వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణల మధ్య వైభవంగా
# వేణుగోపాలస్వామివారి రథోత్సవం

**రుక్మిణి--సత్యభామ సమేతుడై భక్తులను అనుగ్రహించిన గోకులానందుడు**

**తిరుమల జూన్ 13 సూర్య న్యూస్:** కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణి--సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన



రథోత్సవం భక్తి పారవశ్యంతో అత్యంత వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళ వాద్యాలు, భజన బృందాల కీర్తనల మధ్య స్వామివారు దివ్య రథాన్ని అధిష్ఠించి గ్రామ వీధుల్లో విహరించి భక్తులకు మంగళ దర్శనం ప్రసాదించారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవంలో భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. రథం ప్రయాణించిన మార్గమంతా భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలుకగా, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. రథం యథాస్థానానికి చేరుకున్న అనంతరం వేదపారాయణం, ప్రబంధ పఠనం, శాత్తుమొర, హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

**రథోత్సవం సందేశం:** వేదాంత తత్వం ప్రకారం ఆత్మను రథికుడిగా శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను మార్గాలుగా భావిస్తారు. ఈ రథోత్సవం ద్వారా శరీరానికి అతీతమైన ఆత్మస్వరూపాన్ని గ్రహించి, ఆత్మానాత్మ వివేకాన్ని పెంపొందించుకోవాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని స్వామివారు భక్తులకు అందిస్తున్నారని పండితులు పేర్కొన్నారు.

**నేడు అశ్వవాహన సేవ:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారి అశ్వవాహన సేవను భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**జూన్ 14న చక్రస్నానంతో ముగింపు:** బ్రహ్మోత్సవాల చివరి రోజైన జూన్ 14న ఉదయం 7.30 గంటల నుంచి 9.45 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ధ్వజావరోహణం జరగడంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగియనున్నాయి.

## టీటీడీకి అశోక్ లేలాండ్ ట్రక్కు విరాళం

**తిరుమల జూన్ 13 సూర్య న్యూస్:** ప్రముఖ వాహన తయారీ సంస్థ అశోక్ లేలాండ్ లిమిటెడ్ శనివారం తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) రూ.31.72 లక్షల



విలువైన ట్రక్కును విరాళంగా అందించింది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం ముందు నూతన వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశోక్ లేలాండ్ సంస్థ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ ట్రక్కు తాళాలను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు. టీటీడీ సేవా కార్యక్రమాలు, రవాణా అవసరాలకు ఈ వాహనం ఉపయోగపడనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ లక్ష్మీ ప్రసన్న, తిరుమల డీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరంపై దాడి

**200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం, 25 లీటర్ల సారా స్వాధీనం**

**దేవిపట్నం జూన్ 13 సూర్య న్యూస్ :** మండల పరిధిలోని నాగులపల్లి గ్రామ శివార్లలో శనివారం పోలీసులు జరిపిన ఆకస్మిక దాడిలో భారీగా నాటుసారా, బెల్లం ఊట



పట్టుబడ్డాయి. స్థానిక ఎస్ఐ కె.షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం. నాగులపల్లి శివారు ప్రాంతంలో నాటుసారా తయారీ జరుగుతోందన్న నమ్మదగిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్ఐ కె.షరీఫ్ తన సిబ్బందితో కలిసి సదరు ప్రాంతంలో ముమ్మర సోదాలు నిర్వహించారు. ఈ ఆకస్మిక దాడిలో నాటుసారా తయారు చేస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి విక్రయానికి సిద్ధంగా ఉంచిన 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సారా తయారీ కోసం అక్కడే సిద్ధంగా ఉంచిన సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అధికారులు అక్కడికక్కడే కుమ్మరించి ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన, పట్టుబడిన నిందితుడిని రంపచోడవరం గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు ఎస్ఐ కె.షరీఫ్ తెలిపారు. మండలంలో అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నాగార్జున విద్యార్థి

**పొదలకూరు జూన్ 13 సూర్య న్యూస్:** నేడు విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితాలో పొదలకూరు పట్టణంలోని శ్రీనివాసపురం వీధిలో ఉన్న నాగార్జున ఇంగ్లీష్ మీడియం



స్కూల్ విద్యార్థి మేకల పూర్ణ చందు ప్రతిభ చాటాడు. ఎస్ఎస్‌సీ 2026 పరీక్షల్లో 589 మార్కులు సాధించిన మేకల పూర్ణ చందు, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ప్రవేశం పొందడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమారుడు కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించాడని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి సాధించిన విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పూర్ణ చందు విజయం పాఠశాలకు, పొదలకూరు పట్టణానికి గర్వకారణమని పేర్కొన్నారు.

# మద్యం మత్తులో యువత భవిష్యత్తు చిత్తు..!

**అమ్మ కన్నీరు.. నాన్న నిస్సహాయం...ఆదాయం కోసం యువత జీవితాలు పణంగా పెడుతున్నారా..?**

**మెంటాడ జూన్ 13 సూర్య న్యూస్:** జిల్లాలో యువతలో మద్యం వినియోగం రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సరదాగా ప్రారంభమైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారి, అనేక కుటుంబాల్లో విషాదానికి కారణమవుతోంది. తల్లిదండ్రుల ఆశలతో పెరిగిన యువకులు చెడు స్నేహాలు, సామాజిక ప్రభావాలకు లోనై మద్యం బారిన పడుతూ తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా యువతలో మద్యం అలవాటు విస్తరిస్తోంది. చదువు, ఉద్యోగం, లక్ష్యాలను పక్కనబెట్టి మద్యం మత్తులో కాలం గడిపే యువకుల సంఖ్య పెరుగుతుండటం సమాజానికి హెచ్చరికగా మారింది. కాలేజీల పరిసరాలు, బెల్ట్ షాపులు, బహిరంగ ప్రదేశాల్లో యువకులు గుంపులుగా మద్యం సేవించడం సాధారణ దృశ్యంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మద్యం ప్రభావంతో రోడ్డు ప్రమాదాలు, కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలు, నేరాల సంఖ్య కూడా పెరుగుతోందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొడుకులు మారతారనే ఆశతో తల్లులు కన్నీరు మున్నీరవుతుంటే, వారిని అదుపు చేయలేక తండ్రులు నిస్సహాయంగా చూస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ఆదాయం కోసం ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారా..?...** మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వాలకు భారీగా ఆదాయం సమకూరుతోంది. అయితే అదే సమయంలో యువత మద్యం వ్యసనానికి బానిసలవుతుండటంతో ప్రజల్లో అనేక ప్రశ్నలు





తలెత్తుతున్నాయి. ఒకవైపు మద్యం నియంత్రణపై ప్రచారం చేస్తూనే, మరోవైపు మద్యం విక్రయాల విస్తరణ కొనసాగుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు మాత్రం నియంత్రిత విక్రయాల ద్వారా అక్రమ రవాణాను అరికట్టడమే కాకుండా, ఆ ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని చెబుతున్నాయి. అయితే సామాజిక వేత్తలు మద్యం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలు ఆదాయం కంటే ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

**కఠిన చర్యలే పరిష్కారం:** యువతను మద్యం వ్యసనం నుంచి దూరం చేయడానికి ప్రభుత్వం, పోలీసులు, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో మద్యం దుకాణాలపై నియంత్రణ, మైనర్లకు మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో మద్యం దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను చైతన్య పరచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. యువతే దేశ భవిష్యత్తు అనే నినాదం సార్థకం కావాలంటే, మద్యం వ్యసనంపై సమాజం మొత్తం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వసతి గృహాలలో దోమల నివారణకు
# ఆల్ఫా సైపర్‌మెత్రిన్ స్ప్రేయింగ్

**సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య**

**పులివెందుల జూన్ 13సూర్య న్యూస్ :** మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా దోమల ద్వారా వ్యాపించే మలేరియా,డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు



చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అరిపుల్లా ఆదేశాల మేరకు.. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో పులివెందుల పరిధిలోని పలు ప్రభుత్వ వసతి గృహాల్లో 'ఆల్ఫా సైపర్‌మెత్రిన్' మందుతో దోమల నివారణ స్ప్రేయింగ్ నిర్వహించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, గాయత్రినగర్ లోని బీసీ కళాశాల వసతి గృహం, నల్లపురెడ్డిపల్లె బీసీ బాలుర వసతి గృహం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లోని గదులు, వరండాలు, మరుగుదొడ్లు, వంటశాల పరిసరాలు, దోమలు ఎక్కువగా ఆశ్రయించే ప్రదేశాలలో ఈ స్ప్రేయింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆల్ఫా సైపర్‌మెత్రిన్ మందు ప్రభావం 8 నుండి 10 వారాల వరకు ఉంటుందని.. స్ప్రేయింగ్ చేసిన గోడలను తుడవడం గానీ, వాటిపై సున్నం వేయడం గానీ చేయరాదని వసతి గృహ సిబ్బందికి సూచించారు. అలాగే పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి శుభ్రంగా కడగాలని కోరారు. ఉపయోగం లేని డబ్బాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలను తొలగించాలని, రాత్రి వేళల్లో ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోపాల్ నాయక్, ఆశా కార్యకర్త శిరీష మరియు ఆయా వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంజన్నకు విశేష పూజలు

**సింహాద్రిపురం జూన్ 13సూర్య న్యూస్ :** గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య



ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట
## మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టిడిపి నేత
# పులిమి రామిరెడ్డి ధర్నా

**నరసరావుపేట జూన్ 13 సూర్య న్యూస్:** రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న తమపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ,శనివారం నాడు నరసరావుపేట రూరల్ పోలీస్




స్టేషన్ ఎదుట టిడిపి నేత, పాలపాడు గ్రామానికి చెందిన పులిమి రామిరెడ్డి ఆందోళనకు దిగారు. స్టేషన్ ముందు బైఠాయించి పోలీసుల ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పులిమి రామిరెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల రోడ్డు కష్టాలను తీర్చేందుకు పాలపాడు నుండి అన్నవరం వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం చుట్టగా గ్రామంలోని రైతులందరూ సహకరించారని తెలిపారు. అయితే, రాయపాటి నాగేశ్వరరావు అనే ఒకే ఒక్క రైతు మాత్రం ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డు పనుల కోసం సదరు రైతు ఇంటికి వెళ్లి, ఎమ్మార్వో సమక్షంలో ఎంతో బ్రతిమిలాడామని ఆయన వివరించారు. అయినప్పటికీ,అతని కుమారుడు లోకేష్ కార్యాలయం పేరు చెప్పుకుంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చి గత ఆరు నెలల్లో తనపై ఐదు అక్రమ కేసులు బనాయించారని రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు కూడా తాము ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించడానికి రూరల్ పోలీసులు నిరాకరించారని కనీసం సమాధానం కూడా చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. "మేము అధికార పార్టీలో ఉన్నామో లేదో కూడా అర్థం కావడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. పాలపాడులో అసలు ఏం జరుగుతుందో వాస్తవాలను తెలుసుకోవాలని మీడియా మరియు ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాలని కోరుతూనే తాను పోలీస్ స్టేషన్ ముందు నిరసనకు కూర్చున్నట్లు రామిరెడ్డి స్పష్టం చేశారు. ఈ నిరసనలో ఆయనతో పాటు పలువురు స్థానికులు కూడా పాల్గొన్నారు.

# పట్టణంలో ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నం

**రూ.30 లక్షల నగదుపై దుండగుల కన్ను.. స్థానికుడి అప్రమత్తతతో తప్పిన భారీ చోరీ**

**బొలెరో వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. సీసీటీవీ ఆధారంగా దర్యాప్తు**

**గుంతకల్లు జూన్ 13 సూర్య న్యూస్ :** పట్టణంలో చోరీల పరంపర కొనసాగుతున్న వేళ మరో ఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం తెల్లవారుజామున ట్రావెల్స్ బంగ్లా రోడ్డు, భాగ్యనగర్ ప్రాంతంలోని ఎస్‌బీఐ ఏటీఎంను దుండగులు లక్ష్యంగా చేసుకుని చోరీకి యత్నించారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించి యంత్రాన్ని బయటకు లాగేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. భారీగా నగదు ఉన్న ఏటీఎంను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో సమీపంలోని ఓ వ్యక్తి గమనించి గట్టిగా అరవడంతో దుండగులు ఒక్కసారిగా అప్రమత్తమై అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ఏటీఎం కేంద్రం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. యంత్రాన్ని బయటకు తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో ఏటీఎంకు నష్టం వాటిల్లింది. అయితే స్థానికుడి అప్రమత్తతతో రూ.30 లక్షల వరకు ఉన్న నగదు సురక్షితంగా మిగిలింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని





పరిశీలించారు. ఏటీఎం కేంద్రంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చి ఈ ప్రయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఇటీవల గుంతకల్లు పట్టణంలో వరుసగా జరుగుతున్న చోరీ ఘటనల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదర్శనగర్, ఆలూరు రోడ్డు ప్రాంతాల్లో జరిగిన చోరీ ఘటనలు మరువక ముందే ఏటీఎం చోరీ యత్నం జరగడంతో పోలీసుల నిఘాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్ర ఉద్యోగులకు వెంటనే 12వ పీఆర్సీ

# అమలు చేయాలి

**: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్**

**కుప్పం(టౌన్) జూన్ 13 సూర్య న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. కుప్పం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల తిరుపతిలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన విజయోత్సవ సభపై చింతామోహన్ విమర్శలు గుప్పించారు. సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కువ సమయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసించడానికే కేటాయించారని ఆయన ఆరోపించారు. దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని చింతామోహన్ పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఆహార భద్రత చట్టం, సమాచార హక్కు చట్టం వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే అమలు చేశాయని తెలిపారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని అన్నారు. గత పన్నెండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం దేశ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దేశం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా చింతామోహన్ స్పందించారు. ఒకవైపు విజయోత్సవ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు వెన్నుపోటు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారని, ఈ రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల వల్ల సాధారణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని అన్నారు. రాష్ట్ర ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరిన ఆయన, ఉద్యోగులు తమ జీతాలు, బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. సుమారు రూ.30 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి, 12వ పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### ఖరీఫ్ సమీపిస్తున్న...

# మరమ్మతులు చేపట్టారా..!

**మహానంది జూన్ 13సూర్య న్యూస్ :** ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న మరమ్మత్తులు చేపట్టారా కేసీ కెనాల్, తెలుగు గంగా కాలువలకు జులై 20 నుండి సాగునీరు వదులుతామని కొన్ని రోజుల క్రితం ప్రకటించారని రైతులు పేర్కొంటున్నారు. గత రబీ సీజన్ అనంతరం ప్రధాన కాలువలకు చేయాల్సిన మరమ్మత్తులు ఏమైనా ఉన్నాయా అత్యవసరం ఎన్ని తాత్కాలికంగా చేపట్టాల్సిన పనులు పెండింగ్లో ఎన్ని ఉన్నాయి అనే దానిపై సంబంధిత శాఖ వద్ద ఆధారాలు ఉన్నాయా లేవా అనే ప్రశ్నలు రైతు ల నుండి వినవస్తున్నాయి. కేసీ/ తెలుగు గంగ కెనాల్ ద్వారా ఖరీఫ్ సీజన్లో సాగునీరు అందించడానికి అని ఏర్పాట్లు చేశామని ఎలాంటి ఇబ్బందులు ఉండవని పైకి ప్రకటిస్తున్న ఇది ఎంతవరకు సాధ్యం అనేది ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తుంది. స్థానిక కిందిస్థాయి సిబ్బంది లస్కర్/ వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు ఉన్నతాధికారులకు బ్లాక్ స్పాట్లు/ పెండింగ్ పనులకు సంబంధించి సాగునీటి శాఖకు తెలియజేయాల్సి ఉంది. పూర్తి వివరాలు ఆ శాఖకు అందజేశారా, తెలియజేసిన నిధుల కొరత కారణంగా అధికారులు ఫైళ్లను పక్కన పడవేశారా అనేది తెలియాల్సి ఉంది. మరమ్మతులు చేపట్టకపోతే ఖరీఫ్ సీజన్లో వర్షాలు ఎక్కువైనప్పుడు, వరదల కారణంగా కాలువకు గండ్లు పడి కొంతమేర నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. మహానంది మండలం బొల్లవరం సమీపంలోని కేసీ కెనాల్ వద్ద కాంక్రీట్ వాల్ దెబ్బతిని శిధిలావస్థకు చేరుకుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి ఇంకెన్ని ఉన్నాయో అధికారులు తేల్చాల్సి ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమిటి ఉపయోగం అని రైతులు విమర్శిస్తున్నారు.



### గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో

# చరిత్రాత్మక ఘట్టం

**తొలిసారిగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం**

**గజపతినగరం జూన్ 13 సూర్య న్యూస్:** గజపతినగరం ఏరియా ఆసుపత్రి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిలో తొలిసారిగా మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. గత పదేళ్లుగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి ఈ అత్యాధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. లక్షల రూపాయల ఖర్చుతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ఆసుపత్రి సూపరింటెండెంట్, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ జగదీష్ పర్యవేక్షణలో, అనస్థీషియా వైద్యులు డాక్టర్ సాయికుమార్, డాక్టర్ దివ్య సహకారంతో ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ బెజవాడ సతీష్ కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. శస్త్రచికిత్సకు అవసరమైన ఇంప్లాంట్ ఖర్చును రోగి భరించగా మిగిలిన వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ సదుపాయాలు, వైద్య సిబ్బంది సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. దాతలు ఇంప్లాంట్ల ఖర్చుకు సహకరిస్తే పేద రోగులకు పూర్తిగా ఉచితంగా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో ఈ అరుదైన శస్త్రచికిత్స విజయవంతం కావడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. ఖరీదైన ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని వైద్యులు పేర్కొన్నారు.



# పేదవాడి పేరుతో అక్రమ మైనింగ్ దోపిడి..!

### కావలిలో 'గ్రావెల్' మాఫియా గుట్టురట్టు...కూటమి ఎమ్మెల్యే అండదండలపై రామిరెడ్డి నిప్పులు

**కావలి జూన్ 13సూర్య న్యూస్ :** నియోజకవర్గంలో ప్రకృతి సంపద యథేచ్ఛగా కొల్లగొట్టబడుతోంది. చెరువులు,కాలువలు, కుంటలు, అడవులు అనే తేడా లేకుండా సర్వం గ్రావెల్ మాయమైపోతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతోనే ఈ భారీ దోపిడీ సాగుతోందని వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఆయన జిల్లా కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల్లో స్వయంగా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కావలి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ అక్రమ తవ్వకాలు, అధికార బలగంపై ప్రత్యేక వార్త కథనం.

**దోచుకోండి.. దాచుకోండి..నన్ను బతికించండి..!**

కావలి పట్టణ ప్రజల్లో ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తోంది. స్థానిక కూటమి ఎమ్మెల్యే తీరు చూస్తుంటే "మీరు ఎంతైనా దోచుకోండి.. నన్ను మాత్రం రాజకీయంగా కాపాడండి" అనే రీతిలో వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రామిరెడ్డి ఫిర్యాదుతో ఉలిక్కిపడిన ఎమ్మెల్యే, హడావుడిగా విలేకరుల సమావేశం పెట్టి.. "మేము తోలేది పేదవాడి ఇళ్ల స్థలాల కోసమే" అంటూ ప్రగల్భాలు పలికారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కథ పూర్తిగా వేరేలా ఉంది. పేదవాడి పేరు చెప్పి అక్రమ లేఅవుట్లకు, ప్రైవేట్ వ్యాపారాలకు రాత్రింబవళ్లు గ్రావెల్ తరలిస్తూ కోట్లు గడిస్తున్నారనేది బహిరంగ రహస్యం. తుమ్మలపెంట,కావలి పెద్ద చెరువు, తాళ్లపాలెం, కప్పరాల తిప్ప మన్నెంగదిన్నె. ఇలా ఒకటేమిటి.. అనేక ప్రాంతాలలో జేసీబీలు, వందల సంఖ్యలో టిప్పర్లు పెట్టి భూమాతను నిలువునా తవ్వేస్తున్నారు. సహజ వనరులు నాశనమైపోతున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. పేదవాడి ఇళ్ల పేరు చెప్పి అక్రమ లేఅవుట్లను నింపేందుకే ఈ గ్రావెల్ అంతా తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రకృతి సంపదను దోచేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?"

**కలెక్టర్ సైతం లొంగిపోయారా? మూగబోయిన మైనింగ్ శాఖ!...** ఈ దోపిడీపై రామిరెడ్డి స్వయంగా జిల్లా ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా... ఇప్పటివరకు ఎలాంటి చలనమూ లేదు. ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యంగా మారడంతో, జిల్లా కలెక్టర్ సైతం స్థానిక ఎమ్మెల్యే ఒత్తిళ్లకు లొంగిపోయారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కావలిలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వ వ్యవస్థలు ఏ విధంగా పక్షపాతంతో పనిచేస్తున్నాయో అర్థమవుతోంది. మరీ ముఖ్యంగా అక్రమ మైనింగ్‌ను అరికట్టాల్సిన మైనింగ్ శాఖకు వినపడదు, కనపడదు, మాటలు రావు అనే రీతిలో మూగనోము నోచింది. అధికార పార్టీ నేతల దబాయింపులకు ప్రజల్లో భయపడి అధికారులు మౌనంగా ఉండిపోవడంతో కావలి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికార గర్వంతో సాగుతున్న ఈ గ్రావెల్ దోపిడీపై కావలి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజా సంపదను కాపాడేందుకు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సీపీ శ్రేణులు పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు.








# సూర్య వెలుగు వార్తకు స్పందన

### వృధాగా రోడ్డు పైన పోతున్న మంచినీరు

### వార్తకు స్పందించిన డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్

**చౌడేపల్లి జూన్ 13 సూర్యన్యూస్ :**మండలంలోని 29 ఎ చింతమాకుల పల్లి గ్రామపంచాయతీ, బయ్యపల్లి నందు గ్రామం నడిబొడ్డున విద్యుత్ శాఖ వారు విద్యుత్ స్థంబాలు పాతడానికి తవ్విన గోతులలో మంచినీటి పైప్ లైన్ పగిలి త్రాగునీరు వృదాగా పోతుండటంతో ఈ విషయమై 12 వ తేదిన సూర్యవెలుగు దిన పత్రికలో వార్తాకథనం ప్రచురిత మైనది. ఈ కథనానికి వెంటనే స్పఃదించిన డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ఎ గఫూర్, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ నరేష్ కుమార్ శనివారం ఉదయం సదరు పైపులైన్ మరమ్మత్తులు దగ్గరుండి జరిపించారు. ఈ సందర్బంగా డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ఎ గఫూర్ మాట్లాడుతూ మండలంలో చాలా చోట్ల విద్యుత్ అధికారులు, గ్రామస్తులు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ గోతులు త్రవ్వుతున్నారని, తర్వాత గోతులను అలాగే వదిలేయడ, పైపు లైన్ డ్యామేజ్ చేయడం వంటివి చేస్తున్నారు. అలాగే ప్రజలు కొందరు తమ ఆవరణలో గల సెప్టిక్ ట్యాంక్ లు నిండి వీధులలోకి మురుగునీరు వదులు తున్నారని వాటిని వెం టనే సరిచేసుకోవాలని తెలియ జేశారు. అంతే కాకుండా గ్రా మంలో పేడ దిబ్బలు వేస్తున్నా రని, చెత్తకుప్పలు వేస్తున్నారని, చెత్తను స్వచ్ఛమిత్రలకు అంద జేయాలని, అందులోనూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందివ్వాలని కోరారు. సమస్య అని తెలిసిన వెంటనే స్పందిస్తున్న డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ఎ గఫూర్ కు,పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.






సూర్య
12 Jun 2026 - Page 9
www.suryavelugu.com - 8985586689
వృధాగా రోడ్డు పైన పోతున్న మంచినీరు..!

### చెన్నై ఐఐటీలో సీటు సాధించిన...

# గిరిజన విద్యార్థి వెంకట్ నాయక్

**అభినందించిన జడ్పీటీసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి**

**వేంపల్లె జూన్ 13 సూర్య న్యూస్:** మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన బంజారా గిరిజన విద్యార్థి ధార్మిక్ వెంకట్ నాయక్ ఐఐటీ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించి చెన్నై ఐఐటీలో సీటు పొందిన సందర్భంగా జడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన విద్యార్థి దేశవ్యాప్తంగా అత్యుత్తమ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. బక్కన్నగారిపల్లె వంటి గ్రామం నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం వేంపల్లి మండలానికే గర్వకారణమని కొనియాడారు. ధార్మిక్ వెంకట్ నాయక్ భవిష్యత్తులో కూడా ఇదే కృషి, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి సివిల్ సర్వీసెస్‌లో ప్రతిభ కనబరిచి ఐఏఎస్ అధికారి కావాలని ఆకాంక్షించారు. తన గ్రామానికి, మండలానికే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అలాగే ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని, విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### శ్రీ మఠంలో సీఎం చంద్రబాబు వ్యక్తిగత వైద్యులు డాక్టర్ గురురాజ్ రావు

**మంత్రాలయం జూన్ 13 సూర్య న్యూస్:** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సీఎం నారా చంద్రబాబునాయుడు వ్యక్తిగత వైద్యులు డాక్టర్ గుర్రాజరావు శనివారం మంత్రాలయం విచ్చేశారు. వీరికి మంత్రాలయం టిడిపి మండల కన్వీనర్ పన్నగా వెంకటేష్ స్వామి స్వాగతం పలికారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. వారి వెంట కోసిగి సిఐ మంజూనాథ్ ,మంత్రాలయం ఎస్సై మల్లికార్జున, టిడిపి నాయకులు వట్టప్ప నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



# రామిరెడ్డికి అండగా యువశక్తి..!

### రాజకీయ మార్పుకు సరికొత్త దిక్సూచిగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

**నెల్లూరు జూన్ 13 సూర్య న్యూస్:** ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో యువత పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. కేవలం ఓటర్లుగానే కాకుండా రాజకీయ వ్యవస్థలో కీలక శక్తిగా ఎదుగుతున్న యువత, తమ ఆశయాలకు అనుగుణంగా నాయకత్వాన్ని ఎంచుకుంటోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని పార్టీ యువనేతలు పేర్కొంటున్నారు. యువత ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా రామిరెడ్డి గుర్తింపు పొందారని వారు తెలిపారు. రాజకీయాల్లో హంగు ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తుండటంతో యువత ఆయన నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తోందన్నారు. యువతకు ఎదురయ్యే విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల వంటి అంశాల్లో రామిరెడ్డి ఎప్పుడూ అండగా నిలుస్తారని పార్టీ నాయకులు తెలిపారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ యువత అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా యువత సాధించే విజయాల్లోనూ కుటుంబ శుభకార్యాల్లోనూ భాగస్వామ్యం అవుతూ ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కారణంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మరింత బలోపేతమవుతోందని అభిప్రాయ పడ్డారు. రాబోయే రోజుల్లో యువత భాగస్వామ్యంతో పార్టీ మరింత బలపడుతుందని, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నాయకత్వంలో యువశక్తి కీలక పాత్ర పోషించనున్నదని పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేశాయి.



EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com